ఈనాడు
కడప
శుక్రవారం 11 ఆగస్టు 2017 | 16 పేజీలు



చెయ్యేరు నదిలో ట్రాక్టరు నడుపుకొంటూ తిరిగి వస్తున్న కలెక్టర్



- అడవుల్లోని కుగ్రామం ఏకిరిపల్లెను సందర్శించి పథకాల పరిశీలన
- 7 కి.మీ. నడుచుకుంటూ వెళ్లి. . ట్రాక్టరులో తిరుగుపయనం
- 'ఈనాడు-ఈటీవీ' కథనాలపై స్పందన.. అండగా ఉంటానని పేదలు హామీ

కొండ కోనల్లో.. ఏకిరిపల్లెకు రాళ్లల్లో..

నడకదారిలో అలసి రాళ్లపై సేదదీరుతున్న కలెక్టరు

కడప, ఈనాడు


ఆ ఊరికి వెళ్లాలంటే దారి లేదు.. అడవిలో నుంచి వెళ్లాలంటే ఏడు కిలోమీటర్లు నడవాలి.. అదీ కొండలు, గుట్టలు ఎక్కుతూ, మొనదేలిన రాళ్లను తప్పించుకుంటూ ముందుకెళ్లాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పదునైన రాళ్లు తలిగి కాళ్లు చీరుకుపోతాయి.. పట్టుతప్పితే ఎత్తైన కొండలపై నుంచి చెయ్యేరు నదిలో పడిపోయే ప్రమాదం ఉంది.. మరోమార్గంలో వెళ్లాలంటే చెయ్యేరు నదిలో నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాలి. . అక్కడక్కడా ఎదురయ్యే నీటిపాయలను జాగ్రత్తగా దాటుకుంటూ వెళితే ఊరు చేరుకోవచ్చు. మధ్యలో నదికి ప్రవాహం వస్తే గండమే. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేని ఆ పల్లెను కాలినడకన

- మిగతా 7లో



ఏకిరిపల్లెకు భద్రత లేకుండా అడవిలో నడచి వెళ్తున్న కలెక్టర్ బాబూరావు

చూసుకో.. రాసుకో!



- కడప శివారులోని ఓ రెవెన్యూ కార్యాలయంలో మాయాజాలం
- కాగితానికో ధర కట్టి సొమ్ము చేసుకుంటున్న రెవెన్యూ ఉద్యోగులు
- అండగల్ మార్చుకున్నా అడగరు.. తప్పుడు పేర్లు రాసినా అంతే
- భూకుంభకోణాలకు అవకాశం.. పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం

ఈనాడు-నిఘావిభాగం

అది కడప జిల్లా కేంద్రానికి శివారున ఉన్న ఓ రెవెన్యూ కార్యాలయం.. అక్కడ నిత్యం పదుల సంఖ్యలో జనం బారులు తీరి ఉంటారు.. రోజూ వందల సంఖ్యలో పత్రాల పరిశీలనతో కళకళలాడుతూ ఉంటుంది.. కొందరు కాగితాలను తిరగేస్తుంటే, మరికొందరు అడ్డంగా రాస్తుంటారు.. అదేదో వినతుల కార్యక్రమమో, సమీక్ష సమావేశమో అనుకుంటే పొరబడినట్లే. అక్కడ కొంతకాలంగా నిత్యం అలాగే కనిపిస్తూ ఉంటోంది మరి.. కారణం.. ఏళ్ల తరబడి దస్త్రాలను పదిలంగా చూసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇప్పుడు కాస్త సడలింపు ఇచ్చారు.. కాసుల మోజులో పడి కాగితానికో ధర కట్టి సొమ్ము

- మిగతా 7లో

రండమ్మా! ఉద్యోగాలిస్తాం!

- ఆర్టీసీలో ఎస్సీ మహిళా డ్రైవర్ పోస్టులకు ఆదరణ కరవు
- ఏళ్ల తరబడి అభ్యర్థుల కోసం ఎదురు చూపులు



చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే

ప్రస్తుత పోటీ ప్రపంచంలో సర్కారు కొలువు స్వీపరైనా చేరేందుకు డిగ్రీ చేసిన వారెందరో ఎదురు చూస్తున్నారు. చదివిన చదువులకు తగినట్లు ఉద్యోగాలు రావడం లేదు. ఎంటెక్, బీటెక్‌లు చేసి కానిస్టేబుల్ ఉద్యోగాలకు వస్తున్నారు. ఎందుకంటే సర్కారు కొలువైతే జీవిత కాలం పాటు భద్రత ఉంటుందనే నమ్మకం. ఆర్టీసీలో మాత్రం ఉద్యోగాలు ఇస్తాం రండమ్మ.. రండి అంటూ అధికారులు పిలుస్తున్నారు. ఏళ్ల తరబడి నుంచి ఏ ఒక్కరు రాలేదు. దీంతో పోస్టులన్నీ అలానే ఖాళీగా ఉన్నాయి. ఇది వరకే ఓసారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎలాంటి స్పందన లేదు. మరో రెండుసార్లు నోటిఫికేషన్ జారీ చేస్తారు. అప్పటికీ స్పందన రాకుంటే ఆ ఉద్యోగాలను జనరల్ క్యాటగిరిలోకి కలిపేస్తారు. నిజం చెప్పాలంటే అర్హులైన అభ్యర్థులు జిల్లాలో లేకపోవడం వల్లనే ఎవరూ ముందుకు రాలేదు.

అన్ని ప్రభుత్వ శాఖల్లో మహిళల వాటా కింద ఉద్యోగాలు కేటాయించారు. అన్ని శాఖల్లో మహిళలు వారి వారి అర్హతలతో ఉద్యోగాలు పొందుతున్నారు. కండక్టరు ఉద్యోగాల్లో కూడా మహిళలున్నారు. ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగాలిస్తామంటూ అధికారులు ఆహ్వానిస్తున్నా చేరేందుకు మాత్రం అర్హులైన అభ్యర్థులు ముందుకు రావడం లేదు. దీంతో

- మిగతా 7లో


రిజిస్ట్రేషన్ చేయించిన వారు లేరు

జిల్లాలో హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి, ఏడాది అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులు, అందులోనూ ఎస్సీ జాబితాకు చెందిన మహిళలెవరూ లేరు. ఆటోలు, ట్రాక్టర్లు నడిపే మహిళలున్నారు. లారీలు, బస్సులు నడిపే మహిళలు ఎవరూ ఇప్పటికీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు.



- బసిరెడ్డి, డీటీసీ, కడప

ఏకశిలానగరిలో ప్రగతి పరుగులెత్తిస్తాం



ఒంటిమిట్ట కోదండ రాముడి సన్నిధిలో సకల వసతుల కల్పనకు శరవేగంగా పనులు చేపడతామని తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి భక్తులకు ఎలాంటి కష్టం రాకుండా చూస్తామన్నారు. తితిదే ఈవోగా బాధ్యతలు చేపట్టాక సింఘాల్ గురువారం తొలిసారి జేఈవో పోలా భాస్కర్, అధికారులతో కలిసి ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని సందర్శించారు.

.. వివరాలు 11లో



కలల లోకం.. ఊరూరా శోకం

- గల్ఫ్ ఏజెంట్ల మోసం.. అమ్మకానికి నిరుపేద మహిళలు
- సేఠ్‌ల చిత్రహింసలు.. వెలుగులోకి మరికొన్ని వేధింపు సంఘటనలు

ఈనాడు, కడప – న్యూస్‌టుడే, రాయచోటి

జిల్లాలోని గల్ఫ్ బాధిత కుటుంబాల్లో కన్నీళ్లు ఆగడం లేదు. ఏజెంట్ల మోసాలు అభాగ్యుల జీవితాలను ఎడారిపాలు చేస్తున్నాయి. జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల నుంచి సుమారు 25 వేల మంది వరకు ప్రస్తుతం కువైట్, సౌదీ, దుబాయ్, ఖతార్ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. వీరిలో కొందరు ఎంతోకొంత సంపాదిస్తుండగా.. మరికొందరు మాత్రం అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల కొందరు బాధితుల వెతలు వెలుగులోకి వచ్చాయి. అదేవరుసలో మరికొందరు బాధితుల కష్టాలు వెలుగులోకి వచ్చాయి.

అనుమతి కొందరికే : జిల్లాలో అనుమతి పొందిన ఏజెంట్లు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. వందలాది మంది అనధికారికంగానే చెలామణి అవుతున్నారు. ఇందులో 200 మంది వరకు ప్రధాన ఏజెంట్లుగా కనిపిస్తుండగా.. మిగిలిన వారు మధ్యవర్తులు. వీరు

- మిగతా 7లో

దిగువ చిత్రంలో కన్నీటి పర్యంతమవుతూ కనిపిస్తున్న వృద్ధురాలు, బాలుడిని చూస్తే మనసు చలిస్తుంది. గాలివీడు మండలం బోరానిచెరువుకు చెందిన ఈమె పేరు బయమ్మ. ఆమె కుమార్తె పార్వతమ్మ ఏడు నెలల కిందట సౌదీకి వెళ్లారు. భర్తచనిపోవడం, పిల్లల బాధ్యత మీద పడటంతో వేరే దారి లేక గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధపడ్డారు. నామమాత్రపు రుసుముతో పంపిస్తామన్న ఏజెంట్ల మాటలు విని ఆమె సౌదీబాట పట్టారు.అక్కడికెళ్లిన ఏడు నెలల్లో రెండు నెలల జీతం మాత్రమే అందగా.. ఐదు నెలల సొమ్ము బకాయి ఉండిపోయింది. సేఠ్‌లు ఆమెను చిత్రహింసలు పెడుతుండటంతో అష్టకష్టాలు పడుతున్నారు. వేధింపులు తట్టుకోలేక.. వెనక్కి వచ్చే మార్గం కనిపించక అల్లాడిపోతున్నారు. వెనక్కి రప్పించాలంటూ తల్లి బయమ్మను కోరగా ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరిలో రెండో ఏజెంటు దొరక్క.. ఆమెను వెనక్కి పిలిపించడంలో ఆలస్యమవుతోంది. ఇక్కడ ఆమె పిల్లలు, తల్లి మనోవేదన వర్ణనాతీతం.



హత్య కేసులో వ్యక్తి అరెస్టు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో జులై 20న జరిగిన దారుణమైన హత్య కేసులో నిందితున్ని అరెస్టు చేసి అతని నుంచి హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనపరచుకున్నట్లు కడప డీఎస్పీ మాసూంబాషా తెలిపారు. అరెస్టైన నిందితున్ని గురువారం సాయంత్రం డీఎస్పీ తన కార్యాలయంలో మీడియా ఎదుట హాజరు పరిచారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. కడప తారక రామానగర్‌కు చెందిన గంధం ఈశ్వరయ్య (23), ఎర్రముక్కపల్లెకు చెందిన చిలకల చాంద్‌బాషాలకు గతంలో పాతకక్ష్యలున్నాయి. ఈశ్వరయ్య ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా జులై 20వ తేదీ రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఈశ్వరయ్యను చాంద్‌బాషా ఎర్రముక్కపల్లె వద్ద అతికిరాతంగా మచ్చుకత్తితో నరికి దారుణంగా హత్య చేశాడు. ఈ మేరకు మృతుడి తల్లి సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాంద్‌బాషాపై హత్య కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం నిందితుడు చాంద్‌బాషాను ఎర్రముక్కపల్లె రైల్వే గేటు వద్ద అరెస్టు చేసి, అతని నుంచి హత్యకు ఉపయోగించి మచ్చుకత్తిని స్వాధీనపరచుకున్నామని డీఎస్పీ తెలిపారు. గతంలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న చాంద్‌బాషాపై త్వరలో రౌడీషీటు తెరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ ఠాణా సీఐ సత్యనారాయణ, ఎస్సైలు హుసేన్, ఖాన్, సిబ్బంది ఉన్నారు.



అరెస్టైన నిందితున్ని మీడియా ఎదుట హాజరుపరచిన కడప డీఎస్పీ మాసూంబాషా, స్వాధీనపరచుకున్న మచ్చు కత్తి

విద్యా సంస్థల బంద్

రాత్రే విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు





ఓ ప్రైవేటు కళాశాల వద్ద విద్యార్థినులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు.. యోవేవిలో బంద్ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం కడపలో విద్యార్థి సంఘ నాయకులు బంద్ నిర్వహించారు. బుధవారం రాత్రే భావిస, అభాయుస, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యుఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. దీంతో మాజీ భావిస జిల్లా కార్యదర్శి శివకుమార్ నేతృత్వంలో బంద్ నిర్వహించారు. నగరంలోని విద్యా సంస్థల వద్ద ఆందోళనలు చేశారు. విద్యార్థులతో ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ నిరసనను తెలియజేసుకోవచ్చునని, కానీ పోలీసులు విద్యార్థి సంఘ నాయకులను బంద్‌కు ముందురోజు రాత్రి బలవంతంగా తీసుకెళ్లడం దుర్మార్గమని ఖండించారు. ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని, దీనిని తిప్పి కొడతామని చెప్పారు. విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో ఇప్పటికే 9 వేల పాఠశాలలను మూత వేశారని, వసతి గృహాలను మూసి వేస్తున్నారని, పేదలకు ఉన్నత విద్యను దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అవలంభిస్తుందని అన్నారు. విద్యారంగాన్ని పరిరక్షించుకునేంత వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభావిస, పీడీఎస్‌యు, భావిస నాయకులు మహేష్, కోటేశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోవేవిలో బంద్ విజయవంతం

యోవేవి (కడప) : యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (భావిఫె), ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (ప్రప్రవిస), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (అభావిస) విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ను విజయవంతం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు అధిక ఫీజుల దోపిడి, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజురీఎంబర్స్‌మెంట్ కోసం బంద్‌ను చేస్తున్నామని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భావిఫె జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు. లక్షలు ఖర్చుపెట్టి విద్యను కొనుక్కోవాల్సిన దుస్థితి వచ్చిందని దీనికి ప్రభుత్వమే కారణమన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను లేకుండా చేయడంలో భాగంగానే, యోవేవికి నిధులు విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో అభావిస నగర కార్యదర్శి వలరాజు, ప్రప్రవిస జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులురెడ్డి, భావిఫె యోవేవి కార్యదర్శి నాయక్, కోటేశ్వర్, కిరణ్, సురేష్, సాయి, వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరు వాన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప జిల్లాలో రెండోరోజు గురువారం కూడా ఓ మోస్తారు వర్షం కురిసింది. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రాయచోటి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. రాయచోటిలో116.6 అత్యధిక వర్షపాతం నమోదు కాగా చిన్నమండెంలో 115.4, సంబేపల్లెలో 88.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అందులో రాజంపేటలో 49.2, నందలూరులో 17.0, పెనగలూరులో 51.4, కోడూరులో 6.6, ఓబులవారిపల్లెలో 29.2, పుల్లంపేటలో 43.6, చిట్వేలిలో 30.2, పోరుమామిళ్లలో 9.2, కాశీనాయనలో 4.2, బిమఠంలో 4.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. అదే విధంగా వీరబల్లిలో 61.0, టి.సుండుపల్లెలో 58.2, లక్కిరెడ్డిపల్లెలో 13.2, చక్రాయపేటలో 34.4, రామాపురంలో 20.0, గాలివీడులో 29.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా వేములలో 3.2, వేంపల్లెలో 4.2, రాజుపాలెంలో 5.2, దువ్వూరులో 3.4, ప్రొద్దుటూరులో 4.4, చాపాడులో 4.6, ముద్దనూరులో 3.2, కొండాపురంలో 2.2, పెద్దముడియంలో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఇద్దరు నిందితుల అరెస్టు

తొమ్మిది తులాల బంగారు గొలుసులు స్వాధీనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: బంగారు దుకాణాలకు వెళ్లి బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ వారి వద్ద ఉన్న నకిలీ బంగారు నగలను పెట్టి ఒరిజనల్ బంగారు నగలు దొంగలిస్తున్న ఇద్దరు దొంగలను కడప సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి తొమ్మిది తులాల బంగారు నగలు స్వాధీనపరచుకున్నట్లు సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అరెస్టైన వారిని గురువారం సాయంత్రం కడప సీసీఎస్ ఠాణాలో పోలీసులు మీడియా ఎదుట హాజరు పరిచారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. కడప తారక రామనగర్‌కు చెందిన కమ్మవారిపల్లె రామాంజనమ్మ (40), ప్రొద్దుటూరు దొరసాని పల్లెకు చెందిన మినుకు ప్రసాద్ ఇద్దరు దగ్గర బంధువులవుతారు. వీరిద్దరు బంగారు దుకాణాల్లోకి వెళ్లి బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ బంగారు నగలు చూపించాలని అడుగుతారు. దుకాణ నిర్వాహకులు బంగారు గొలుసులు చూపించే క్రమంలో వారి దృష్టిని మరల్చి వారి వద్ద ఉన్న నకిలీ బంగారు వస్తువులను అక్కడ ఉంచి అసలైన బంగారు నగలను దొంగలించేవారు. వీరిపై ప్రొద్దుటూరు, కడపలోని పలు ఠాణాల్లో కేసులున్నాయి. 2014లో ప్రొద్దుటూరులో జరిగిన చోరీలో సీసీ పుటేజీల ద్వారా నిందితులను గుర్తించామన్నారు. ఈ మేరకు వీరిపై నిఘా ఉంచామన్నారు. నిఘాలో భాగంగా గురువారం ఐటీఐ కూడలి వద్ద ప్రొద్దుటూరు ఒకటో పట్టణ ఎస్సై చిన్నపెద్దయ్య సీసీఎస్ ఎస్సై నాగరాజు వారి సిబ్బంది వీరిద్దరిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.2.25 లక్షలు విలువ చేసే తొమ్మిది తులాల బంగారు నగలు స్వాధీనపరచుకున్నామని డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

జిల్లాలో ప్రతి ఒక్క బంగారు దుకాణ నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిదన్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండ ప్రతి ఒక్క దుకాణాదారుడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. దీని వల్ల దొంగలను సులువుగా పట్టుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. వీరిద్దరిని సీసీ పుటేజీల ఆధారంగానే పట్టుకోవడం జరిగిందన్నారు.



అరెస్టైన దొంగల వివరాలను వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, పక్కన ఎస్సైలు, సిబ్బంది, స్వాధీనపరచుకున్న బంగారు గొలుసులు

నోటీసు

మా కక్షీయదారుడు అయిన బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, తండ్రి వీరారెడ్డి, ప్రొద్దుటూరు తరపున సదరు టౌనులో ఉండే Dr. ఎర్రిముని రంగారెడ్డి (ప్రమీలా రంగారెడ్డి), తండ్రి చిన్న సుబ్బారెడ్డి గారికి తెలియచేయడం ఏమనగా,

మీనుండి షెడ్యూలు ఆస్తిని మా కక్షీదారుడు విక్రయించుకొని రూ. 5,00,000/-లు విక్రయ మొత్తంలోనికి భాగంగా చెల్లించి మీనుండి టోకన్ / విక్రయ అగ్రిమెంటు పొందివున్నాడు. అట్టిదానిలోని విషయములను నెరవేర్చుటకు మా కక్షీదారుడు ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నప్పటికీ మీరు కాలయాపన చేస్తూ వచ్చి అట్టిదానికి వ్యతిరేకంగా ప్రవర్తించుచున్నారు. మీకు అట్లు చేయుటకు హక్కు లేదు.

మా కక్షీయదారుడు షెడ్యూలు ఆస్తిని గురించి 24-8-2017వ తేదీన మీనుండి అట్టి టోకన్ / విక్రయ అగ్రిమెంటు మేరకు రిజిష్టర్ పొందుటకు ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సిద్ధంగా ఉండగలడు. కావున ఆ దినం మీరు ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు హాజరై షెడ్యూలు ఆస్తిని గురించి విక్రయ దస్తావేజులను వ్రాయించి స్వాధీనపరచవలసినదిగా కోరడమైనది. అట్లు మీరు తప్పినంతట మీపై మా కక్షీయదారుడు తీసుకొనబోయే సివిల్, క్రిమినల్ చర్యలకు, ఖర్చులకు మీరే బాధ్యులగుదురని తెలియచేయడమైనది.

షెడ్యూలు

కడప జిల్లా, ప్రొద్దుటూరు రి॥డి॥, ప్రొద్దుటూరు సబ్ డిస్ట్రిక్టు, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లె పంచాయతీ, కొత్తపల్లె గ్రామపొలంలోని

1) S.No. 489, 490 విస్తీర్ణం య. 2-60 సెంట్లు.
2) S.No. 484 విస్తీర్ణం య. 2-20 సెంట్లు.

ఇట్లు : శ్రీ ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

నెల్లూరులో ప్రొద్దుటూరు వాసి మృతి



మృతి చెందిన రహీం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎస్కే రహీం అనే (60) వృద్ధుడు గురువారం నెల్లూరులో మృతి చెందినట్లు మూడో పట్టణ ఎస్సై కృష్ణంరాజునాయక్ తెలిపారు. మృతుడు నెల్లూరుకి మూడు రోజుల క్రితం వచ్చి ఉంటారని అక్కడి పోలీసులు తెలిపినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు అక్కడి పోలీసులు తమకు సమాచారం ఇచ్చారని తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ప్రొద్దుటూరులో ఉంటే స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలిపాలని ఎస్సై కోరారు.

అనధికారికంగా నడుస్తున్న ఆశ్రమాలపై చర్యలేవీ?

గుడ్‌హార్ట్ వృద్ధాశ్రమంతో వెలుగులోకి వచ్చిన నిజాలు

ఆశ్రమాలకు.. అనుమతులున్నాయా?



'రెండు వారాల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన గుడ్‌హార్ట్ వృద్ధాశ్రమం సంగతి తెలిసిందే. సేవ ముసుగులో వారు చేస్తున్న ఆరాచకాలు ఒక్కసారి బహిర్గతమయ్యాయి. స్వయంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి చొరవ చూపడంతో ఆశ్రమ నిజాలు రాష్ట్ర ప్రజలందరూ తెలుసుకున్నారు. అప్పటి నుంచి ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, సొసైటీలపై ప్రజలకున్న నమ్మకం సన్నగిల్లుతోంది.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: 'గుడ్‌హార్ట్ వృద్ధాశ్రమానికి నెలకొకసారి వచ్చి ఇక్కడున్న వృద్ధులందరితో మాట్లాడి వారికి కావాల్సిన వస్తువులను ఇస్తున్నాను. అంతే కాకుండా నాకు తెలిసిన స్నేహితులను కూడా తీసుకొచ్చి వీరికి అవసరమయ్యే సామగ్రి గత ఏడేళ్ల నుంచి ఇస్తూ వస్తున్నాను. కానీ ఇన్ని దారుణాలు జరుగుతున్నాయనే విషయం తనకు తెలియదు. ఇక వృద్ధాశ్రమాలను ఎలా నమ్మడం' అంటూ ఓ యువకుడు స్వయానా జిల్లా ప్రధాన న్యాయమూర్తితో అన్న మాటలివి.

■ జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా వృద్ధాశ్రమాలు, ఆశ్రమాలు, సొసైటీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బిడ్డల ఆదరణ లేని వృద్ధులు తలదాచుకునేందుకు వృద్ధాశ్రమాలకు వస్తుంటారు. ఆ వయస్సులో కూడా వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సబబు. ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల పేరిట చాలా మంది లక్షల రూపాయలు వెనకేసుకున్నారు. సేవ గోరంత అయితే, లాభం కొండంత ఉంటుంది. వృద్ధులను చూపించి దాతలు, ప్రభుత్వం, విదేశాల నుంచి లక్షల రూపాయలు స్వాహా చేస్తున్నారు. వృద్ధాశ్రమాలు, ఆశ్రమాలు, సొసైటీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవో నంబరు 30 కింద తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అలాంటి వారికి జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తారు. జిల్లాలో డబ్బులతో నడిచే, ఉచితం, ప్రభుత్వ నిధులు, విదేశాల నుంచి వచ్చే నిధులతో నడిచే వృద్ధాశ్రమాలు, ఆశ్రమాలు సుమారు 20 వరకు ఉంటాయి. వీటిల్లో కొన్నింటికి మాత్రమే అనుమతులున్నాయి. అనుమతులు లేని ప్రభుత్వ దృష్టికి రానివి చాలా ఉన్నాయి. అలాంటి వాటిపై అధికారులు దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుంది.

దరఖాస్తు పెట్టడం ఇలా...

అనుమతి పొందడానికి సంస్థకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు, సంస్థ సిబ్బంది వివరాలు, అనుమతి పొందిన ల్యాబ్ నుంచి శుద్ధ నీరు, ధ్రువీకరణ పత్రాలు, పన్ను పత్రాలు, చిరునామా, ఆధారాలు తదితర వివరాలతో సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవోకు దరఖాస్తు చేయాలి. వాటిన్నింటినీ పరిశీలించిన సీడీపీవోలు ప్రాజెక్టు డైరెక్టరుకు పంపుతారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారు.

చట్టం ఏం చెబుతోంది...

వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఆదరణ సంరక్షణ, పరిరక్షణ, సంక్షేమానికి నిర్వహిస్తున్న సంస్థలన్నీ తప్పనిసరిగా అనుమతులు పొంది ఉండాలి. మహిళలు, వృద్ధులు, పిల్లలు అనాథ శరణాయాల బయట ఉన్నా, లోపల ఉన్నా వారికి తగిన రక్షణ ప్రమాణాలతో కూడిన వసతి, ఆహారం, సౌకర్యాలు, గుర్తింపు, గౌరవం, కల్పించాలని అంతర్జాతీయ తీర్మానాలు, ఒప్పందాలు చెబుతున్నాయి. వాటిని అమలు పరచడానికి కేంద్ర ప్రభుత్వం బాలల న్యాయ (పిల్లల సంరక్షణ, పరిరక్షణ) చట్టం 2000, మహిళా శిశు సంస్థల (లైసెన్సింగ్) చట్టం 1956ను తీసుకొచ్చారు. ఈ చట్టాన్నీ మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అమల్లోకి తీసుకొచ్చి చట్టానికి సంబంధించి నియమావళిని 2010 జీవో ఎంఎస్ నంబరు 30 ద్వారా అమల్లోకి తెచ్చింది.

అనుమతులు లేకుంటే...

ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలకు తప్పనిసరిగా అనుమతులుండాలి. అనుమతులు లేకుండా నిర్వహిస్తే నిర్వాహకులకు మూడు నెలలు జైలు శిక్ష లేదా రూ.5 వేలు అపరాధ రుసుం విధిస్తారు. రెండు కలిపి విధించ వచ్చును. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచి పెట్టినా, పరిత్యాగం చేస్తే అలాంటి వారికి కోర్టు శిక్ష విధిస్తుంది.



కడప శివారులోని ఓ ఆశ్రమం

వృద్ధులు.. పిల్లలకు భద్రత ఉందా?

అనుమతి ఇలా పొందాలి

జిల్లా స్థాయిలో లైసెన్సింగ్ అథారిటీకి జిల్లా కలెక్టరు కన్వీనర్‌గా, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, ఎస్పీతో కూడిన కమిటీ ఉంటుంది. ఒక జిల్లా కంటే ఎక్కువ జిల్లాలో సంస్థలకు అనుమతి కోసం రాష్ట్ర మహిళాభ్యుదయం, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన కమిటీ ద్వారా లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

◆ గుడ్‌హార్ట్ వృద్ధాశ్రమం వారు కేవలం వృద్ధులను మాత్రమే ఉంచుకోవాలి, కానీ నిబంధనలకు వ్యతిరేకంగా మానసిక వికలాంగులను, అప్పుడే పుట్టిన బిడ్డలు, మైనర్ల వద్ద ఉంచుకున్నారు. ఇలా చేయడం నేరమవుతోంది. వీరందరినీ చూపించి దాతల నుంచి డబ్బులు, వివిధ రకాల సామగ్రిని తీసుకుని వెనకేసుకున్నారు.

◆ జిల్లాలో వివిధ రకాల ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలున్నాయి, వాటిలో కొన్ని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. ప్రభుత్వ దృష్టిలోకి రాని ఆశ్రమాలు చాలా ఉన్నాయి. ఇలాంటి వారు సేవ ముసుగులో వారి సొంత ప్రయోజనాలు ఎక్కువగా చేసుకుంటున్నారు. సేవ చేస్తున్నామని చెప్పి విదేశాల నుంచి భారీ మొత్తంలో డబ్బులు స్వాహా చేస్తున్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న వృద్ధాశ్రమాలు, ఆశ్రమాలపై అధికారులు దృష్టి పెట్టాలి.

◆ సేవ చేస్తున్నామని గతంలో ఓ ఆశ్రమం వారు ప్రభుత్వాన్ని నమ్మించారు. దీంతో అధికారులు అది నిజమని భావించి వారికి ఆశ్రమం కోసం స్థలాన్ని కేటాయించారు. కొద్ది రోజుల పాటు ఆశ్రమాన్ని నడిపి తరువాత మూసి తమ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు.

◆ జిల్లాలో గుడ్‌హార్ట్ వృద్ధాశ్రమాల్లాంటివి ఎక్కడైనా ఉంటే వాటిపై కూడా దాడులు చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రెండు వారాల క్రితం హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి ఇలాంటి వాటిపై స్పందిస్తే బాగుంటుందన్నారు. నగర నడిబొడ్డున ఉన్న ఈ వృద్ధాశ్రమంలో ఆరేళ్ల నుంచి ఇన్ని దారుణాలు జరుగుతుంటే ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. కానీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్వయంగా రంగంలోకి దూకడంతో జిల్లా అధికార యంత్రాంగమంతా అప్రమత్తం అయింది.

పునరావాస కేంద్రాల్లో విద్యుత్తు సమస్యలకు పరిష్కారం

నిర్వాసిత ప్రాంతాల్లో ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి పర్యటన



పొన్నతోట పునరావాస కేంద్రంలో అధికారులకు సూచనలు ఇస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో విద్యుత్తు వసతులు పక్కాగా కల్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని పలు పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టుల నేపథ్యంలో నివాసాలు కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకు ఆయా శాఖల అధికారులను ప్రభుత్వం పురమాయించి పనులు చేయిస్తుంది. అందులో విద్యుత్తు వసతి కల్పన ఒక భాగం. పునరావాస కేంద్రాల్లో వసతిపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈ కొన్ని కేంద్రాల్లో పర్యటించారు. అక్కడి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చారు. ముద్దనూరు మండలం శెట్టివారిపల్లె, కొండాపురం మండలం గుండ్లూరు, ఓబన్నపేట, యర్రగుంట్ల మండలం కలమల్ల, హనుమాన్‌గుత్తి, జమ్మలమడుగు మండలం పొన్నతోట, తదితర పునరావాస కాలనీల్లో తిరిగారు. పొన్నతోటలో ట్రాన్స్‌ఫార్మర్లు కేవలం ఎత్తు తక్కువలో ఉన్నాయి, అవి ప్రమాదమని వెంటనే ఎత్తులో అమర్చాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా అక్కడక్కడ ఉన్న చిన్న చిన్న మరమ్మతులను చేయాలని సూచించారు. కాలనీలోని ప్రజలు కొందరు తీగలకే నేరుగా కొక్కీలు తగిలించి విద్యుత్తును అక్రమంగా వినియోగించడాన్ని గమనించిన ఆయన వారికి అవగాహన కల్పించి మీటర్లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఈలకు సూచించారు. పొన్నతోట, శెట్టివారిపల్లె కాలనీల్లో నివాసాలపై వెళ్తున్న విద్యుత్తు తీగలను మార్చేయాలని ఆదేశించారు. అనంతరం మార్గ మధ్యంలో తటస్థపడిన రోడ్డుకు అడ్డంగా వెళ్తున్న తీగలను పరిశీలించి వెంటనే వాటిని మార్చేయాలని అధికారులకు చెప్పారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇదే విషయంపై విద్యుత్తు అధికారులకు కొన్ని అంశాలను సూచించారు. వాటిని దృష్టిలో పెట్టుకుని ఎస్ఈ గట్టి ఆదేశాలు ఇచ్చారు. ఆయన వెంట స్థానిక విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

రైల్వేకోడూరు

పోలీసు సేవల కొరకు 100

ఎంఈవో కార్యాలయానికి 100 కుర్చీలు



కుర్చీలను పరిశీలిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మండల విద్యాశాఖ కార్యాలయానికి ఎంఈవో ఎం.పద్మజ 100 కుర్చీలు తెప్పించారు. గత కొన్ని నెలలుగా ఎంఈవో కార్యాలయంలో సమావేశాలు జరిగేటప్పుడు కుర్చీల కొరత వల్ల ఉపాధ్యాయులు కింద కూర్చొనేవారు. దీంతో ఎంఈవో 100 కుర్చీలు తెప్పించడంతోపాటు ఎంఈవో కార్యాలయానికి కొత్తగా రంగులు కూడా వేయించారు. కార్యాలయ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తామని ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయులు వారి విధులు సక్రమంగా నిర్వహించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెదేపా నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలి



మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తమ పార్టీ ఎమ్మెల్యేలను విమర్శించే ముందు తెదేపా నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు ఎమ్మెల్యే ప్రతినెలా ప్రజాధనంతో జీతాలు తీసుకుంటూ ఇంట్లో కూర్చుంటున్నాడని తెదేపా నాయకులు చెప్పడం సరికాదన్నారు. సీఎంతో చెప్పి ప్రత్యేక జీవో తెచ్చుకుని ప్రతిపక్ష ఎమ్మెల్యేల జీతాలను కూడా తెదేపా నాయకులకే దక్కేలా చేసుకోవచ్చన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పార్టీలకతీతంగా ప్రజల ఓట్లతో గెలిచిన ప్రతి ఎమ్మెల్యేకి ఏసీడీపీ నిధులు, ఆరోగ్య నిధులు కేటాయించేవారన్నారు. అనారోగ్య బాధితులు దరఖాస్తు చేసుకుంటే వారికి నేరుగాకానీ తహసీల్దార్లు, ఎంపీడీవోల ద్వారా నిధులు మంజూరయ్యేవన్నారు. కానీ ఇప్పుడు తెదేపా నాయకులు సిఫారసు చేస్తేనే నిధులు మంజూరవుతున్నాయని చెప్పారు. రైల్వేకోడూరులో రైల్వే అండర్ బ్రిడ్జి, బైపాస్ రోడ్డు ప్రజలకు ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. అధికార పార్టీ నాయకులకు ప్రజలపై ప్రేమ ఉంటే ముఖ్యమంత్రికి చెప్పి ఆ రెండు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కస్తూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ)
బెండకాయలు	40
మటిక్కాయలు	50
వంకాయలు	40
బీట్‌రూట్	40
బంగాళదుంప	30
కాకర	50
టమోటాలు	40
పచ్చిమిరప	60
క్యాలీఫ్లవర్	40
అల్లం	80
చిక్కుడు	70
క్యారెట్	60
ఎర్రగడ్డలు	35
క్యాబేజీ	30
మునక్కాయలు	50
బీన్స్	80
దొండ	40
ముల్లంగి	40

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	480
చికెన్	140
చికెన్ (స్కిన్‌లెస్)	160
100 గుడ్లు	380
డజను గుడ్లు	50
చేపలు	100

తెరపై ఈనాడు

శ్రీ లక్ష్మీ ప్యారడైజ్ : నక్షత్రం
శ్రీ కృష్ణా : గౌతమ్‌నంద,
లవ : దర్శకుడు
సిద్ధేశ్వర : ఫిదా
ఎఎస్ఆర్ : మాయామాల్

పింఛన్లపై నిర్లక్ష్యమేల?

◆ ప్రతినెలా పదిశాతం వరకు తీసుకోవడంలేదు ◆ నాలుగో నెల నుంచి తీసుకోకపోతే నిలుపుదల



పింఛన్లు ఇచ్చే సమయానికి ఇంటిదగ్గర లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఆధార్, రేషన్ పత్రాల్లో సామాజిక పింఛనుకు తగిన వయస్సు, అర్హత లేకపోయినా తమకూ పింఛను కావాలంటూ ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతారు. సర్పంచులు, అధికారులు, రాజకీయ నేతలకు పలు దఫాలుగా అర్జీలు సమర్పించుకుంటారు. తీరా పింఛను మంజూరైన తరువాత ప్రతినెలా ప్రభుత్వం అందజేసే ఉపకారాన్ని తీసుకోవడానికి బద్ధకిస్తున్నారు. మన జిల్లాలో మొత్తంగా 2,60,907 మందికి పింఛన్లు మంజూరవుతుండగా వీరిలో సుమారు ఏడు నుంచి పదిశాతం మంది పింఛన్లు నెలవారీగా తీసుకోవడంలేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈనెలలో జిల్లా వ్యాప్తంగా 2,41,903 మంది మాత్రమే పింఛను తీసుకున్నారు. యాభై మండలాల్లో కలిపి 19,004 మంది పింఛను పొందలేదు. ఇక రైల్వేకోడూరు మండలంలో 7,236 మంది లబ్ధిదారులకుగాను 680మంది, ఓబులవారిపల్లెలో 5,154 మందికిగాను 325మంది, పెనగలూరులో 3,813 మందికి 257 మంది, చిట్వేలిలో 4,441 మందికి 334 మంది, పుల్లంపేట మండలంలో 4,332 మందికిగాను 321 మంది పింఛన్లు తీసుకోలేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

● ఎందుకిలా..?

ఒక నెల, రెండు నెలలు పింఛను తీసుకోకపోయినా మూడవ నెలలో మొత్తంగా కలిపి ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఈ ధైర్యంతోనే అనేకమంది పింఛన్లు తీసుకోవడానికి బద్ధకిస్తున్నారు. మరికొందరు నెలనెలా రూ.వెయ్యి తీసుకునే బదులు మూడో నెలలో ఒకేసారి రూ.3,000 తీసుకుంటే ఏదో ఒక అవసరానికి పనికొస్తుందని భావించేవారూ ఉన్నారు. అదీగాక కేవలం లబ్ధిదారు వస్తే తప్ప ఇతర కుటుంబ సభ్యులకు పింఛన్లు ఇవ్వరాదని సర్కారు ఆదేశించింది. ప్రతినెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మాత్రమే పింఛన్ల పంపిణీ ఉంటుంది. ఈ సమయంలో లబ్ధిదారులు ఇళ్ల వద్ద లేకపోయినా, ఆసుపత్రులకో, ఇంకేదో పనిమీద గ్రామం దాటి వెళ్లినా ఇక ఆ నెలకు వారికి పింఛను అందదు. ఇలా ఆగిపోతున్న పింఛన్ల నగదును సక్రమంగా తిరిగి ప్రభుత్వానికి చెల్లించడం, వచ్చే నెలలో మళ్లీ పింఛను తీసుకోని వారి జాబితాలను తయారు చేయడం తలకు మించిన భారంగా మారుతోందని కార్యదర్శులు వాపోతున్నారు.

● నాలుగో నెలకు కట్..!

లబ్ధిదారుడు వరుసగా మూడు నెలలు పింఛను తీసుకోకపోతే ఇక నాలుగో నెల నుంచి పింఛను కట్ అవుతుంది. అలా జరిగితే లబ్ధిదారుల కష్టాలు మొదటికొస్తాయి. ఒకవేళ మూడు నెలల పింఛను ఒకేసారి తీసుకుందామని భావించినా.. మూడో నెలలో సరిగ్గా పింఛన్లు పంపిణీ చేసే సమయానికి వాటిని తీసుకోలేక పోతే కష్టాలను కొనితెచ్చుకున్నట్లు అవుతుందని రైల్వేకోడూరు ఎంపీడీవో సంజీవరావు చెబుతున్నారు. అందువల్ల లబ్ధిదారులు అందుబాటులో ఉంటే ప్రతినెలా పింఛను తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సర్కారు సాయం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని పింఛనుదారులు గమనించుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు కార్పొరేషన్ రుణాలకు ముఖాముఖి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మండలపరిషత్ కార్యాలయం వద్ద ముఖాముఖి నిర్వహిస్తామని రుణాల అధికారి(లోన్స్ అధికారి) మనోజ్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 69 యూనిట్లు మంజూరు కాగా 549 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 12 యూనిట్లకుగానూ 108 మంది, బీసీ కార్పొరేషన్ ద్వారా 50 యూనిట్లకుగానూ 234 మంది, కాపు కార్పొరేషన్ ద్వారా 80 యూనిట్లకు 570 మంది, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 27 యూనిట్లకు 142 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయా అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

సమగ్ర విద్యాహక్కు చట్టాన్ని అమలుచేయాలి



పాఠశాల నుంచి ఇంటి వెళ్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టాలను సమగ్రంగా అమలు చేయాలంటూ గురువారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల పిలుపుమేరకు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సెలవు ప్రకటించారు. హెచ్ఎంఎం ఉన్నత పాఠశాలను నిర్వహించబోగా సంఘాల నాయకులు కృష్ణచైతన్య, రాజశేఖర్, సందీప్ అడ్డుకుని విద్యార్థులను ఇళ్లకు పంపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలను మూసివేసే ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణం భర్తీ చేయాలన్నారు. మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్లు, ఉపకార వేతనాలను మంజూరు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా సమస్యలను పరిష్కరించకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ప్రోత్సాహ బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాతలు

చక్రంపేట(పెనగలూరు), న్యూస్‌టుడే: విద్యార్థులకు దాతలు ఆర్థిక ప్రోత్సాహం అందించడం అభినందనీయమని చక్రంపేట ప్రధానోపాధ్యాయుడు ఎస్.జిలానీ బాషా తెలిపారు. గురువారం కీ.శే.శ్రీమతి పోలిన మునెమ్మ స్మారక సంస్థ కాకర్లవారిపల్లి వారు 2016-17 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ తుంగా మునెయ్య మట్లాడుతూ గత అయిదేళ్లుగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని దాత సూచించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఉద్యాన కళాశాలలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

అనంతరాజుపేట(రైల్వేకోడూరు (గ్రామీణ), న్యూస్‌టుడే : పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతామని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ గ్రామాలలోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మనం నాటే మొక్కలు భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ తనూజ, డాక్టర్ అరుణోదం, విద్యార్థులు పాల్గొన్నారు.

మూలాలను నేర్పిస్తేనే పాఠ్యాంశాలపై పట్టు




ఆంగ్ల పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

రాజంపేట, న్యూస్‌టుడే : మొక్కుబడిగా పాఠాలు బోధించడం కాదు.. విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రతి పాఠ్యాంశంలోని మూలాలను నేర్పిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. రాజంపేట మండలం ఏకిరిపల్లె పర్యటన సందర్భంగా ఆయన బగ్గిడిపల్లె ప్రాథమిక పాఠశాలను, మందపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బగ్గిడిపల్లె ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఎందుకని ప్రశ్నించారు. చాలాచోట్ల ఉపాధ్యాయుల్లేక ఇబ్బంది పడుతుంటే ఇక్కడ ఇద్దరు ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఇద్దరుండి కూడా పాఠశాలను శుభ్రంగా పెట్టుకోలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకిరిపల్లెలో అంగన్వాడీ కార్యకర్తతో ఆయన మాట్లాడుతూ ఎన్ని రోజుల నుంచి పిల్లలకు కోడిగుడ్డు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గత మూడు నెలలుగా గుడ్లు రావడం లేదని ఆమె చెప్పడంతో వెంటనే ఐసీడీఎస్ పీడీకి మెమో ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మందపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు గణితం, ఆంగ్లాన్ని బోధించారు. గణితంలో సూత్రాలను సక్రమంగా చెప్పాలని, ఆంగ్లంలో గ్రామర్ రాకపోతే పిల్లలకు పరిజ్ఞానం ఉండదని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు.

రైల్వేకోడూరు

అర్హులకే రాయితీ రుణాలు



లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహిస్తున్న అధికారులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: అర్హులైన వారికే రాయితీ రుణాలు అందిస్తామని ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక బ్యాంకు అధికారులదేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ఎండీ హుస్సేన్, మండల కమిటీ సభ్యులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల పరిధిలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో పారదర్శకంగా ముఖాముఖి నిర్వహించినట్లు ఎంపీడీవో ప్రతాప్ తెలిపారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో దరఖాస్తుదారులతో ఎంపీపీ ఇర్షాద్ బేగం అధ్యక్షతన కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారులు సమక్షంలో ఈ ముఖాముఖి నిర్వహించారు. ప్రతి లబ్ధిదారునితో తను ఏర్పాటుచేయాలనుకున్నా యూనిట్ గురించి అధికారులు మాట్లాడారు. మండల వ్యాప్తంగా 287 మంది ముఖాముఖికి హాజరైనట్లు అధికారులు తెలిపారు. యూనిట్ పెట్టే వారికే ప్రాధాన్యత ఉంటుందని బ్యాంకు అధికారులు సమావేశంలో పేర్కొన్నారు. కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారుల సమన్వయంతో ఎంపికలు నిర్వహిస్తామని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, కమిటీ సభ్యుడు కొత్త బాలకృష్ణ, పుచ్చకాయల వెంకటరమణ, సర్పంచి ప్రసాద్, ఏపీజీపీ పెనగలూరు మేనేజర్ పి.భాస్కర్, ఎస్‌బీఐ క్షేత్రస్థాయి అధికారి నాగరాజు, పొందలూరు ఏపీజీపీ క్షేత్రస్థాయి అధికారి ఆర్‌పీ సింగ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



క్రేన్ సహాయంతో ప్రతిష్టిస్తున్న ధ్వజస్తంభం



గోపురాలకు కలశ ప్రతిష్ఠ చేస్తున్న వేదపండితులు, దాతలు

పుత్తనవారిపల్లె(పుల్లంపేట), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పుత్తనవారిపల్లెలోని పర్వతవర్ధినీ దేవి సమేత రామలింగేశ్వరాలయంలో గురువారం ధ్వజ స్తంభ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలశాలకు, రాతి ధ్వజస్తంభాలకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం నాగప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి మండలంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దాత రోడ్డుభవనాలశాఖ ఈఈ దేవదాసు ఆర్థిక సహాకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఇటీవల వీచిన పెనుగాలులకు ఆలయంలోని ధ్వజస్తంభం కూలిపోయింది. దీంతో దాతల సహకారంతో ధ్వజస్తంభాన్ని విజయవంతంగా ప్రతిష్టించామని గ్రామపెద్దలు తెలిపారు



ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకిస్తున్న భక్తులు

అక్రమ విద్యుత్తు వాడితే చర్యలు

రాజంపేట నేరవార్తలు, న్యూస్‌టుడే : రైతులు విద్యుత్తును సక్రమంగా వినియోగించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఫైజున్నీసా సూచించారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బ్రాహ్మణపల్లె గురువారం విద్యుత్తు వినియోగదారులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి రైతులతో మాట్లాడుతూ.. విద్యుత్తును అక్రమంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట పొలాలకు సైతం అధికారుల అనుమతితో విద్యుత్తు సౌకర్యం కల్పించుకోవాలన్నారు. అక్రమంగా తీగల ద్వారా కరెంటు తీసుకొంటే దానివల్ల ప్రమాదాలు జరగి ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదముందని వివరించారు. న్యాయ పరంగా సమస్యలు ఎదురైతే న్యాయసేవా సంస్థ ద్వారా సహాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది లక్ష్మీనారాయణ, న్యాయవాదులు శ్రీనివాసులు, రమణ, సుబ్బరాయుడు విద్యుత్తు శాఖ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్యాలపై చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న పురపాలిక కమిషనర్ రమణారెడ్డి, అధికారులు, విద్యార్థులు

రాజంపేట, న్యూస్‌టుడే : దేశానికి వెన్నెముక అయిన యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పురపాలిక కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులు గురువారం మారకద్రవ్యాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి పాతబస్టాండు వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా, మీ లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడి చదవాలని చెప్పారు. స్థానిక పాతబస్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పనడి విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహిద్దాం

రాజంపేట : స్వాతంత్ర్య దినోత్స వేడుకలను అందరి సహకారంతో కనులపండువగా నిర్వహిద్దామని ఆర్డీవో వి.వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న నిర్వహించే వేడుకల్లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాల్స్‌ని ఏర్పాటు చేయటంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల్లో మంచి సేవలు అందించిన ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థలకు ప్రశంసాపత్రాలను కూడా అందిస్తామన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పెనగలూరు, న్యూస్‌టుడే: రైతు సేవలో రెవెన్యూ గ్రామ సభలలో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. గురువారం కోమంతరాజపురం రెవెన్యూ గ్రామాల రైతులతో సర్పంచి రామతులశమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించుకోవడానికి తగిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూమి హద్దుల సమస్యలను సర్వే చేయించుకుని పరిష్కరించుకోవాలన్నారు. భూమి వివరాలను అంతర్జాలం చేసుకోవడం వలన ప్రభుత్వ రాయితీ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రధర్, వీఆర్‌వోలు నరసింహులు, రాంబాబు, సర్వేయర్ మునిస్వామి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీపీఆర్ కండ్రిగ(రైల్వేకోడూరు గ్రామీణ) : తగిన ఆధారాలతో చూపించి మీ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని వీపీఆర్ కండ్రిగలో రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నవారు అర్జీల రూపంలో ఇస్తే పరిష్కరిస్తామన్నారు. రైతులు తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి పెంచలయ్య, ఎంపీటీసీ సుధాకర్‌రాజు, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.






పెనగలూరు: రెవెన్యూ సదస్సులో అధికారులు ... రైల్వేకోడూరు గ్రామీణ: మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ

నిండిన చెక్‌డ్యాంలు, పంట సంజీవని కుంటలు

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో గురువారం తెల్లవారు జామున పెద్ద వర్షం కురిసింది. తెల్లవారు జామున 5 గంటల నుంచి 50 నిమిషాల పాటు కురిసిన వర్షం 51.4 మీ.మీగా నమోదైంది. పెనగలూరులోని రంగమ్మ చెరువు వర్షపు నీటితో దాదాపు 70శాతం మేర నిండింది. గ్రామాలలో కాలువలు, పొల్లాల్లో పెద్ద ఎత్తున నీరు నిలబడింది. వెలగచర్ల, కొండూరు, పెనగలూరు కాలువల్లో, వంకల్లో వర్షపునీరు పెద్దఎత్తున ప్రవహించింది. పలుప్రాంతాల్లోని చెక్‌డ్యాంలు, గుంతలు, పంట సంజీవని కుంటల్లో మోస్తరుగా వర్షపునీరు నిలిచింది. వర్షానికి అడుగంటిన భూగర్భ జలాలు పెరుగుతాయని మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నారాయణనెల్లూరులోని చెక్‌డ్యాం నిండుగా ఉన్న నీరు



కాలువలో పారుతున్న నీరు

సేవలు అభినందనీయం



పెనగలూరు: ఉపాధ్యాయుడిని సన్మానించిన గ్రామస్థులు

వియమ్‌పురం(పెనగలూరు), న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొండూరు పంచాయతీ వియమ్ పురం పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.మహమ్మద్ షరీఫ్ సేవలు అభినందనీయమని గ్రామ ప్రజలు తెలిపారు. తమ గ్రామం నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి యువకులు, పెద్దలు పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానం చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉన్నత చదువులకు మంచి మార్గాలు సూచించారని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించానని ఉపాధ్యాయుడు షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎస్.వసుంధరాదేవి, సుబ్బనరసయ్య, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లెంవారిపల్లె(పుల్లంపేట) : విద్యార్థులకు ఉత్తమంగా బోధించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని మల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న సహ ఉపాధ్యాయురాలు శాంతకుమారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాటు విద్యార్థులకు ఉత్తమంగా బోధించారని ఆమె సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్లిన చోట కూడా విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తు న్న ఉపాధ్యాయ సిబ్బంది



సత్తా చాటిన కృష్ణా, కడప జిల్లాల ఎడ్లు


పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు

వేముల, న్యూస్‌టుడే: మండలంలోని మీదిపెంట్ల పంచాయతీ పరిధిలోని భూమయ్యగారిపల్లెలో గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ పోటీల్లో కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన రాజచౌదరి, కడప జిల్లా రాజుపాలెం మండలం వెలవలికి చెందిన కసనూరు హుస్సేన్‌లకు చెందిన ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో మూడువేల అడుగుల దూరం లాగి, సమానంగా నిలిచాయి. దీంతో మొదటి, ద్వితీయ బహుమతులను ఈ ఎడ్ల జతల యజమానులు సమానంగా అందుకున్నారు. సాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను పులివెందుల వైకాపా సమన్వయకర్త వైఎస్ భాస్కరరెడ్డి ప్రారంభించారు. అలాగే కొత్తకోట గురునాథంకు చెందిన వృషభాలు 2760 అడుగుల దూరం లాగి మూడోస్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లాకు చెందిన అనంతనేని మధు వృషభాలు 2524 అడుగుల దూరం లాగి నాలుగు, ఇదే జిల్లాకు చెందిన నవనీత్ కృష్ణ ఎడ్లు 2509 అడుగుల దూరం లాగి ఐదోస్థానాలను కైవసం చేసుకున్నాయి. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.లక్ష, 80 వేలు, రూ.60 వేలు, ఇతర నగదు బహుమతులను అందించారు. ఈ పోటీలను తిలకించడానికి అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి తదితరులు వచ్చారు.

సాగునీటి వనరులను మెరుగుపరిస్తేనే అభివృద్ధి

రైతు బజార్లు, శీతల గిడ్డంగుల ఏర్పాటుకు కృషి


మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారి విద్యావతి, చిత్రంలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి.. ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మైదుకూరు, న్యూస్‌టుడే : సాగునీటి వనరులను మెరుగుపరిస్తే మైదుకూరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతుబజార్లు, శీతల గిడ్డంగుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గురువారం మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నూతన పాలకవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ కేసీకాల్వ, తెలుగుగంగతో నియోజకవర్గానికి సాగునీరు అందించడంతో మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలుగుగంగ కాల్వలో 5 వేల క్యూసెక్కులు ప్రవహించేలా కర్నూలు జిల్లాలో జీరో కి.మీ. నుంచి 18 కి.మీ వరకు రూ.285 కోట్లతో పంపిన ప్రతిపాదనను ఆమోదించేందుకు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారని, పదిరోజుల్లో అనుమతి వస్తుందని చెప్పారు. రైతుబజార్లు, శీతల గిడ్డంగుల అంశంపై జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఐదెకరాలు స్థలం చూపిస్తే మంజూరుకు మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. స్థలం విషయమై తహసీల్దారుతో చర్చించినట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ బ్రహ్మంగారిమఠానికి భూగర్భ మురుగు కాల్వ వ్యవస్థ ఏర్పాటుకు రూ.15.50 కోట్లు మంజూరు చేశారన్నారు. పార్టీ నాయకులు నేట్లపల్లె మల్లికార్జున, వై.వెంకటసుబ్బారెడ్డి, అంకిరెడ్డి, కటారికృష్ణ, చొక్కం సంజీవరాయుడు, సలీం, అబ్దుల్లా, షబ్బీర్‌బాషా, కొండపల్లి ఉమాకాంత్, గుడిపాడు బాబు, తుమ్మల వెంకటకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం.. మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతుల మధ్య ఛైర్మన్‌గా భూమిరెడ్డి పెద్దిరెడ్డిగారి సుధాకర్‌రెడ్డి, ఉప ఛైర్మన్‌గా సయ్యద్ గౌస్‌పీర్, డైరెక్టర్లుగా పెద్దపోతుల విజయప్రతాప్ నాయుడు, మొగిలి రామాంజనేయులు, సాకం రామసుబ్బారెడ్డి, ఎ.పి.జయరాయుడు, మిగిలిన పాలకవర్గ సభ్యులచే మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ విద్యావతి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు నియోజకవర్గ బాధ్యుడు సుధాకర్‌యాదవ్, పార్టీ నాయకులు అభిమానులతో కలిసి ప్రదర్శన ప్రారంభించారు. నాలుగురోడ్ల కూడలిలోని కృష్ణదేవరాయులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, పురపాలిక ఛైర్మన్ రంగసింహ, బీమఠం జడ్పీటీసీ గోవిందరెడ్డి, ఆసుపత్రి సలహా కమిటీ ఛైర్మన్ గుండంరాజు సుబ్బయ్య, సిండికేట్ సొసైటీ అధ్యక్షుడు చీకిరి చిన్న వెంకటసుబ్బయ్య, కేసీకాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ రెడ్యం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపువాసుల నిరీక్షణకు తెర?

బాధితులకు ఆర్డీవో భరోసా ◆ 8 బృందాలతో సర్వే


కట్టడాల నమోదు పత్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో డిప్యూటీ కలెక్టరు, తహసీల్దార్లు

అట్లూరు, న్యూస్‌టుడు : అట్లూరు మండలంలోని సోమశిల ముంపు గ్రామాల బాధితులు పరిహారం అందక ఏళ్ల తరబడి చేస్తున్న నిరీక్షణకు తెరపడనుంది. ముంపు బాధితులందరూ సహకరిస్తే జిల్లా కలెక్టరు పరిహారం ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆర్డీవో వీరబ్రహ్మం బాధితులకు భరోసా ఇచ్చారు. గురువారం అట్లూరు మండలంలోని చింతువాండ్లపల్లె, రంగంపల్లె, చెన్నేపల్లె, మలినేనిపట్నం, వరికుంట గ్రామాల్లో 8 బృందాలుగా అధికారులు ఇళ్లను సర్వే చేశారు. ఈ సర్వే రెండు రోజులపాటు జరుగుతుంది. డిప్యూటీ కలెక్టర్లు నాగరాజు, బాబయ్య, ఈశ్వరయ్య, చెంగల్‌రావు, అజయ్‌కుమార్ పర్యవేక్షణలో 8 మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో సర్వేయర్లు, పంచాయతీరాజ్ ఏఈలు, నీటి పారుదల శాఖ ఏఈలు, అటవీశాఖ సిబ్బంది సహకారంతో ఈ సర్వే చేపట్టారు. ఐదు గ్రామాల్లో 8 బృందాలు సంబంధిత రీచ్‌లల్లో సర్వే చేశారు. ముంపునకు గురవుతున్న కట్టడాల ప్రస్తుత స్థితి, నివాసమా, పరిహారం కోసం నిర్మించినవా అనే కోణంలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. చింతువాండ్లపల్లెలో ఆర్డీవో వీరబ్రహ్మం ముంపువాసులతో మాట్లాడుతూ ఈ సర్వేను సజావుగా జరిగేలా చూడాలని కోరారు. 15 ఏళ్లుగా కోర్టులను ఆశ్రయిస్తున్నా ముంపువాసులకు సరైన న్యాయం జరగలేదని అంటున్నారు. చింతువాండపల్లెలో సర్వే అనంతరం ఇంటి యజమానులు సంతకాలు చేయకపోవడంతో ఆర్డీవో స్థానికులకు అవగాహన కల్పించడంతో బాధితులు సంతకాలు చేసారు.

పాత కొలతలే ప్రామాణికం .. అట్లూరు మండలంలోని మలినేనిపట్నం గ్రామం 2006 నుంచి అనేక మార్లు ముంపుతో కట్టడాలన్నీ నేలమట్టమయ్యాయి. గతంలో అధికారులు ఇళ్ల సర్వే చేసిన దస్త్రాల ఆధారంగా వివరాలను పరిగణిలోకి తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. మలినేనిపట్నం రీచ్ 17ను సర్వే చేస్తున్న బృందాలను స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం నేల తప్ప ఇళ్లు లేవన్నారు. ఈవిధంగా చేస్తే ముంపుబాధితులకు మట్టి మిగులుతుందని వారు వాపోయారు. చింతువాండ్లపల్లెలో 24 ఇళ్ల పరిహారం అభ్యంతరాలు హైకోర్టు పరిధిలో ఉన్నాయిని సర్వే చేయద్దంటూ స్థానికులు డిప్యూటీ కలెక్టరు నాగరాజుకు వినతి పత్నాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఈశ్వరయ్య, మాధవరెడ్డి, దామోదర్‌రెడ్డి, రాంసింగ్, సత్యానంద్, నరసింహులు, ఆంజనేయులు, ఉదయ్‌సంతోష్, చంద్రాయుడు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

గునిపాటి సోదరులతోనే మంగంపేట అభివృద్ధి

ఘనంగా గునిపాటి కేశవులు సంతాప సభ

మంగంపేట(ఓబులవారిపల్లె) : గతవారం అనారోగ్యంతో మృతిచెందిన మంగంపేట మాజీ సర్పంచి గునిపాటి కేశవులు సంతాప సభను ఆయన కుమారుడు గునిపాటి చెన్నరాయుడు(మండల ఉపాధ్యక్షులు) ఆధ్వర్యంలో గురువారం మంగంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు హాజరైన మాజీ కేంద్ర మంత్రి, తెదేపా నాయకులు సాయిప్రతాప్ మాట్లాడుతూ 20 సంవత్సరాల పాటు కేశవులు మంగంపేట సర్పంచిగా, ఆయన తమ్ముడు గునిపాటి రామయ్య తెదేపా ఎంపీగా రాజకీయాలలో ఉంటూ మంగంపేట అభివృద్ధికి కృషిచేశారన్నారు. అనంతరం నియోజకవర్గ బాధ్యడు కస్తూరి విశ్వనాథనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయాలలో కీలకపాత్ర పోషించిన గునిపాటి సోదరులు స్వర్గీయులు కావడం బాధాకరమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు మాట్లాడుతూ మంగంపేట అభివృద్ధికి గునిపాటి కుటుంబమే కారమణన్నారు. కల్లా చలపతి, అనుమలగుండ చంద్రమోహన్, గల్లా శ్రీనివాసులు, అమెరికా తానా అధ్యక్షులు వేమన సతీష్‌నాయుడు, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, మార్కెట్ ఛైర్మన్ ఉపాధ్యక్షులు జ్యోగినేని మణి, ప్రముఖులు, మంగపేట వాసులు, గునిపాటి అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

చిన్నపల్లికి రూ.5.61 కోట్లు ముంపు పరిహారం మంజూరు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : కొండాపురం మండలం చిన్నపల్లి ముంపు బాధితులకు రూ.5,61,36,343 పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు గురువారం జల వనరుల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి శశిభూషణ్‌కుమార్ పేరిట ఉత్తర్వు-436 జారీ చేశారు. శ్రీకృష్ణదేవరాయ గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో భాగంలో పెన్నానదిపై 26.85 టీఎంసీల నిల్వ సామర్థ్యం గండికోట జలాశయాన్ని నిర్మించారు. ఇందులో కృష్ణా జలాలు నిల్వ చేయనున్నారు. గండికోట వెనక జలాలను పులివెందుల ప్రాంతానికి తరలించేందుకు జీకే- సీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. మార్గ మధ్యంలో తిమ్మాపురం జలాశయంలో 0.30 టీఎంసీల నీరు నిల్వ చేయాలని పనులను చేపట్టారు. దీంతో సమీపంలో ఉన్న చిన్నపల్లి గ్రామం ముంపునకు గురికానుంది. దీంతో 2013లో జల వనరుల శాఖ అధికారులు ఏం చేయాలని ఆలోచించారు. ప్రజలు కూడా ఈ సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం మంజూరు చేయాలని వేడుకున్నారు. ఈ మేరకు కలెక్టరు ప్రభుత్వానికి 2017 మే 17న నివేదించారు. ఈ ఊర్లో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 2016-17 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం రూ. 2,91,36,343 పరిహారం చెల్లించేందుకు తాజాగా అనుమతిచ్చారు. అదేవిధంగా ఒక్కొక్క కుటుంబానికి పునరావాసం, జీవన భృతి చెల్లింపునకు రూ.6.75 లక్షల లెక్కన రూ.2.70 కోట్లు మంజూరు చేసేందుకు పచ్చ జెండా ఊపారు.

గండికోట- సీబీఆర్ ఎత్తిపోతల నిర్వహణకు రూ.6.44 కోట్లు.. గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల పథకం నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.44 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం జల వనరుల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి శశిభూషణ్‌కుమార్ పేరిట ఉత్తర్వు-441 జారీ చేశారు. గండికోట జలాశయం నుంచి పులివెందుల ప్రాంతానికి వెనక జలాలను 8.30 టీఎంసీలు తరలించేందుకు ఈ పథకానికి రూపకల్పన చేశారు. వార్షిక నిర్వహణ కోసం ఎల్ఐ-01 ఎత్తిపోతలకు రూ. 1,49,47,504, ఎల్ఐ-2కి రూ. 1,44,13,200, ఎల్ఐ-3కి రూ. 90,79,216, ఎల్ఐ-4కి రూ. 86,89,808, ఎల్ఐ-5కు రూ. 1,73,33,760 మంజూరు చేశారు.

ఉక్కు కోసం సమైక్యాంధ్ర తరహా ఉద్యమం



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్‌లు, విద్యార్థులు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోటిరెడ్డి కూడలిలో రాకపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలకు మద్దతుగా ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. జడ్పీ నుంచి కోటిరెడ్డి కూడలి, అంబేద్కర్‌కూడలి, నూతన కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కడప ఉక్కు రాయలసీమ హక్కు అని నినదించారు. ఉక్కు సాధనకు సమైక్యాంధ్రా తరహా ఉద్యమాలను నిర్వహిస్తామని విద్యాసంస్థల అధిపతులు తెలిపారు. 35వ రోజు దీక్షలను ప్రైవేటు పాఠశాలల ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకపా రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వమే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పిందని, ఇక్కడ ఎవరి స్వార్థం కోసం ఉద్యమాలు చేయడం లేదని, సీమ అభివృద్ధి కోసం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు సాధించే వరకు ఎన్ని త్యాగాలకైనా వెనుకాడబోమని తెలిపారు. పవన్ పాఠశాల కరస్పాండెంట్ జోగి రామిరెడ్డి జిల్లాలో 3 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, పరిశ్రమ ఏర్పాటు అయితే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఇనుప ఖనిజం, డోలమైట్, రవాణా, నీరు, రహదారులు అన్నీ ఉన్నా ఎందుకు పరిశ్రమ ఏర్పాటు చేయడం లేదని శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. కడపలో 200 సంవత్సరాలకు సరిపడా ఇనుప ఖనిజాలు అందుబాటులో ఉన్నాయని, అయినా సెయిల్ వారు ఖనిజాలు లేవని చెప్పడం కుట్ర పూరితమైనదని విమర్శించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు, రాకపా నాయకులు పాల్గొన్నారు.

రండమ్మా! ఉద్యోగాలిస్తాం!

(మొదటి పేజీ తరువాయి) ఏళ్ల తరబడి ఆర్టీసీలో మహిళా డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి ఏడాది ఆర్టీసీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తున్నారు. ఏ ఒక్కరూ రాకపోవడంతో పోస్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. అర్హులైన అభ్యర్థుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

- జిల్లాలో ఇప్పటి వరకు ఎస్సీ జాబితాలో హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఏడాది అనుభవం కలిగి ఉన్న మహిళా డ్రైవర్లు ఎవరూ లేరు. ఆటోలు నడుపుతున్న మహిళలున్నారు. బస్సులు, లారీలు లాంటి భారీ వాహనాలు నడిపే మహిళలు ఎవరూ లేకపోవడంతో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో సుమారు ఏడు హెవీ డ్రైవింగ్ పాఠశాలలు, 33 సాధారణ డ్రైవింగ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో మహిళలు శిక్షణ పొందితే సులువుగా ఉద్యోగాలు వస్తాయి. ఎలాంటి సిఫార్సులు, లంచాలు ఇచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ఇంటికే నియామక ఉత్తర్వులు పంపిస్తారు. జిల్లాలో ఏ రవాణాశాఖ కార్యాలయాల్లో హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన మహిళలెవరూ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఎస్సీ మహిళలే కాదు, ఏ వర్గానికి చెందిన మహిళలు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అసలు జిల్లాలోనే ఎవరూ లేరు. ఇప్పటికైనా ఎస్సీ జాబితాకు చెందిన మహిళలెవరైనా భారీ వాహనాలు నడిపే లైసెన్సు కలిగి ఉండి, ఏడాది అనుభవం ఉంటే క్షణాల్లో ఉద్యోగం వస్తుంది. ఇతర జిల్లాల్లో హెవీ లైసెన్సు కలిగిన మహిళలున్నారు. ఇక మీదే ఆలస్యం.

ఉద్యోగాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.. ఆర్టీసీలో బ్యాక్‌లాగ్ అందులోనూ ఎస్సీ కులానికి చెందిన మహిళలు ఎవరైనా హెవీ డ్రైవింగ్ లైసెన్సు ఉంటే చాలు.. ఏడాది అనుభవం ఉంటే సులువుగా డ్రైవరు ఉద్యోగాలు వస్తాయి. వారి కోసం 23 ఉద్యోగాలు ఉన్నాయి ఏళ్ల తరబడి నుంచి ఖాళీగా ఉన్నాయి. ఎవరూ లేకపోవడంతో భర్తీ చేయడం లేదు. ఎవరైనా ఉంటే నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు. **-చెంగల్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, కడప**

చూసుకో.. రాసుకో!

(మొదటి పేజీ తరువాయి) చేసుకుంటున్నారు. రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు చాలా కీలకమైనవి. ఒకప్పుడు అన్నీ మ్యాన్యువల్ రూపంలోనే ఉండగా.. ప్రస్తుతం ఈ-పాలనలో భాగంగా డిజిటలైజేషన్ కింద నిర్వహిస్తున్నారు. గతంలోని రికార్డులు మాత్రం ప్రస్తుతం చాలా ముఖ్యంగా కనిపిస్తున్నాయి. ఆర్ఎస్ఆర్ నుంచి 1-బి, అడంగల్ పహాణీ.. తదితరాలు కేవలం రెవెన్యూ కార్యాలయాల్లోనే దొరుకుతాయి. ఇందులో అడంగల్ మాత్రం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. క్రయవిక్రయాల నేపథ్యంలో భూముల కొత్త యజమానుల పేర్లతో అప్‌డేట్ అవుతూ ఉంటాయి. మిగిలిన వాటిలో మాత్రం భూమి తొలి స్వరూపం, అప్పట్లో ఎలా నమోదై ఉంటుందో అలాగే కనిపిస్తుంది. ఇప్పుడు ఈ రికార్డులకే ఎసరు పెట్టారు. ఆ కార్యాలయంలో కొందరు మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. వారు భూకబ్జాలు, ఆక్రమణలను ప్రోత్సహించే క్రమంలో అక్రమాలకు తెరతీస్తున్నారు. ఆ క్రమంలోనే కార్యాలయంలోని కొందరు అధికారులు, సిబ్బందిని మచ్చిక చేసుకున్నారు. వారి ద్వారా చక్రం తిప్పుతున్నారు.

అంతా అంతే మరి : ప్రస్తుతం కార్యాలయంలోని రికార్డులనే మార్చేస్తున్నారు. కబ్జారాయుళ్లకు వంతపాడే క్రమంలో ఇష్టానుసారంగా పేర్ల దిద్దుబాట్లకు దిగుతున్నారు. ఇందుకు కొందరు అధికారులు సైతం సహకరిస్తున్నారు. కేవలం అక్రమార్కులు ఇచ్చే పైసలకు ఆశపడి ఇష్టారాజ్యంగా చక్కబెట్టేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. దీంతో కార్యాలయంలోని నిజమైన రికార్డులు మాయమవుతున్నాయి. నకిలీ రికార్డులు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం కొందరి ఆధీనంలో భూములు ఉంటే.. రికార్డుల్లో పేర్లు మాత్రం వేరే వారి వివరాలతో నమోదవుతున్నాయి. చివరకు కొన్ని పత్రాలను లేకుండా చేసేస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. సాధారణంగా రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు బయటకు రావాలంటే చాలా కష్టమైన పని. ఆ సిబ్బంది మాత్రమే నిర్దేశ నిబంధనలకు లోబడి తీసుకురావచ్చు. అదీ ఎక్కడ మార్పులు చేర్పులు చేస్తున్నామో ఉన్నతాధికారులకు చెప్పిన తర్వాతే సాధ్యమవుతుంది. ప్రైవేటు వ్యక్తులు దస్త్రాలు చూడటమన్నది అసాధ్యమే. అలాంటిది ఆ కార్యాలయంలో మాత్రం అంతా అడ్డంగా సాగుతోంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం ప్రస్తావనార్హం. వారే సిబ్బందికి వంతపాడుతూ ఉండటం.. కాసుల కక్కుర్తిలో భాగంగా కుటిలనీతిని ప్రదర్శిస్తుండటం దయనీయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ మండల పరిధిలో భారీ భూకుంభకోణాలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను ఆక్రమించి అడ్డంగా పాగా వేసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓ దశలో వేలాది ఎకరాల్లో ప్రైవేటు వ్యక్తులు పాగా వేసినా ఇదేంటని ప్రశ్నించ లేని దుస్థితి. ఈ క్రమంలో ఉన్న ఆ అరకొర రికార్డులనూ గల్లంతు చేసేస్తుండటం అధ్వానంగా మారింది. కళ్లముందే వాగులు, వంకలను కబ్జా చేసేస్తున్నా.. కొందరు అధికార పార్టీ నేతలు చక్రం తిప్పుతూ ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నా ఇదేంటని అడగని అధికారులు.. ఇప్పుడు అడ్డదారిలో దస్త్రాలను ధారాదత్తం చేస్తుండటం సమస్యను జటిలం చేస్తోంది. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి అక్రమాలను కట్టడి చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.!!

కొండ కోనల్లో.. ఏకిరిపల్లెకు రాళ్లల్లో..

(మొదటి పేజీ తరువాయి) వెళ్లి సందర్శించారు కడప జిల్లా కలెక్టర్ బాబూరావు నాయుడు. రాజంపేట మండలం ఏకిరిపల్లె ఇందుకు వేదికైంది. ఇక్కడి పరిస్థితిపై గతేడాది ఆగస్టు 15న 'ఈనాడు-ఈటీవీ' ప్రత్యేక కథనాలు వెలువరించగా.. ప్రజల ఇబ్బందులు బయటి ప్రపంచానికి తెలిశాయి. సుమారు రూ.20 లక్షల మొత్తాన్ని రోడ్డు నిర్మాణం కోసం అధికారులు విడుదల చేశారు. రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అభ్యంతరాలు ఉండటంతో సమస్య ఏర్పడింది. దీంతో నెలల తరబడి నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. గురువారం మళ్లీ 'ఈనాడు-కడప' సంచికలో 'ఏకిరిపల్లెకు దారేదీ?' శీర్షికన కథనం రావడంతో కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఏకిరిపల్లెలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు సిద్ధపడ్డారు. గురువారం ఉదయం ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే కొద్దిమంది సిబ్బందితో ఆయన పల్లెకు పయనమయ్యారు. బగ్గిడిపల్లి వరకు వాహనంలో వెళ్లి అక్కడి నుంచి కాలినడక ప్రారంభించారు. కొండలను ఎక్కుతూ, రాళ్లగుట్టలను దాటుకుంటూ రెండు గంటలపాటు శ్రమించారు. అత్యవసర సమయాల్లో బాధితులను ప్రధాన రోడ్డుపైకి తీసుకురావాలంటే వాడే 'జల్లి'కట్టే విధానం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ ఏకిరిపల్లెలో నిరుపేదల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అభివృద్ధి అంటే ప్రభుత్వం పూచీ పడటమే

అరవిందనగర్, (న్యూస్‌టుడే, కడప): అభివృద్ధి అంటే విద్యకు ప్రభుత్వం పూచీ పడటమని ఇందుకు నిదర్శనం ఫిన్‌ల్యాండ్ దేశమని అఖిల భారత బీమా ఉద్యోగుల సమితి (ఏఐఐఇఏ) జోనల్ సంయుక్త కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. నిజమైన అభివృద్ధి అంటే ఒక్క శాతం పేదలు ధనవంతులు 58 శాతం సంపదను పోగేసుకోవడం కాదన్నారు. నగరంలోని ఇంజినీర్స్ భవన్‌లో గురువారం సామ్రాజ్య కార్మిక వర్గ ఐక్యత నిజమైన అభివృద్ధి అంటే ఏమిటి అనే అంశంపై పీపుల్ ఫర్ ఇండియా ఫోరం అధ్యక్షుడు రఘునాథ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు రాంగోపాల్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రామవరెడ్డి, జేవీవీరాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, పించనుదారుల సంఘం బీబీఎస్‌రాజు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బేగ్ పాల్గొన్నారు.

దోపిడీ ముఠాకు క్లోరోఫాం విక్రయించిన డీలరు అరెస్టు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కేవలం కళాశాలలకు, కర్మాగారాలకు విక్రయించాల్సిన క్లోరోఫాంను దోపిడీ ముఠాకు పైగా ఎక్కువ ధరకు విక్రయించిన రసాయనాల డీలరును గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై మోహన్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. ఏడుగురు అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా కడప చిన్నచౌకు ఠాణా పరిధిలోని ఫక్కీర్‌పల్లెలో 15 రోజుల క్రితం ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ముక్కుకు క్లోరోఫాం చూపించి దోపిడీకి యత్నించారు. కానీ ఆమె వారి నుంచి తప్పించుకుంది. ఈ మేరకు పోలీసులు ఏడుగురిని మూడు రోజుల క్రితం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఈ ముఠాకు నిబంధనలకు వ్యతిరేకంగా రూ.500 విలువ చేసే క్లోరోఫాంను రూ.3500లకు విక్రయించిన హైదరాబాదుకు చెందిన సుధాకర్‌రెడ్డిని కూడా అరెస్టు చేశామన్నారు. కేవలం కళాశాలలకు, కర్మాగారాలకు మాత్రమే క్లోరోఫాంను విక్రయించాలన్నారు. ఇతరులెవ్వరికి విక్రయించరాదని ఎస్సై చెప్పారు.

కలల లోకం.. ఊరూరా శోకం



ఇక్కడ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న ఈమె పేరు రేవన పార్వతి. ఈమె స్వస్థలం రాయచోటి మండలం ముసలిరెడ్డిగారి పల్లి. ఆరు నెలల కిందట ఉపాధి కోసం రూ.లక్షలు వ్యయం చేసి సౌదీకి వెళ్లారు. అక్కడ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సేఠ్ కుటుంబం దుర్మరణం చెందగా.. పార్వతి మాత్రం ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. పట్టించుకునే దిక్కులేక, మెరుగైన చికిత్స అందక ఆమె పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. ఎప్పటికి నయమవుతుందో, ఎప్పుడు తిరిగి స్వస్థలానికి వస్తుందో అర్థం కాని పరిస్థితి.

(మొదటి పేజీ తరువాయి) గ్రామాల్లోకి వెళ్లి పరిచయాలు పెంచుకోవడం.. స్థానికుల సహకారంతో మహిళలకు ఆశచూపి గల్ఫ్‌కు వెళ్లేలా ఒప్పించడం చేస్తున్నారు. అందుకు సమ్మతించిన వారికి అడ్డదారిలో వీసాలు, పాస్‌పోర్టు ఇప్పించి అడ్డంగా పంపించేస్తున్నారు. ఈ పత్రాల్లోనూ స్పష్టత ఉండటం లేదు. ట్రాన్సిట్ వీసాతో ఉపాధికి పంపుతున్నారు. నకిలీ పాస్‌పోర్టులతోనూ తరలించేస్తున్నారు. దీనికితోడు, గల్ఫ్ దేశాల్లో ఏజెంట్లు చెబుతున్న పనికి, అక్కడికి వెళ్లిన తర్వాత సేఠ్ చెప్పే పనికి పొంతన ఉండటం లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో బాధితులు ఆవేదనకు గురవుతున్నారు. అప్పు చేసి వెళ్లడంతో వెనక్కి తిరిగి రాలేక సతమతమవుతున్నారు. ఇక్కడే ప్రస్తుతం కొత్తపల్లవి అందుకోవడం అనుమానాస్పదంగా మారింది.

అదెలా సాధ్యం : ప్రస్తుతం గల్ఫ్‌కు పంపేందుకు ఏజెంట్లు మహిళలనే ఎక్కువగా ఎంచుకుంటున్నారు. అదీ యువతులుగా ఉన్న వారికే అవకాశం కల్పిస్తున్నారు. ఎంతటి కష్టాన్నైనా తట్టుకుని పనిచేస్తారనే ఉద్దేశంతో సేఠ్‌లు కావాలని అడుగుతున్నారంటూ ఏజెంట్లు నమ్మబలుకుతుండగా.. వాస్తవం వేరే ఉందన్నది తరచిచూస్తే అర్థమవుతోంది. లైంగిక వేధింపుల్లో భాగంగానే తరలిస్తున్నారన్నది బాధితులను కదిలిస్తే అర్థమవుతోంది. అందుకు ఎర వేసే క్రమంలో ఉచితంగా పంపిస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. తామే పత్రాలను సిద్ధం చేసి పంపుతామంటూ బుకాయిస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత చిక్కుకుపోతున్న వారు ఎందరో. మహిళలను గల్ఫ్ మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నారు. జిల్లాలో కరవు నేపథ్యంలో స్థానికంగా ఉపాధి పనులు లేవు. ఈ పరిస్థితిని ఏజెంట్లు అవకాశంగా తీసుకుని గల్ఫ్‌కు తరలిస్తున్నారు. మరికొందరు ఇళ్లలో పని చేసుకుని కాలం గడుపుతున్నారు.

ఇప్పుడేమో ఇలా.. : గల్ఫ్ వెళ్లిన వారు వెనక్కి రాలేక, సేఠ్‌ల చేష్టలను తట్టుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఓ దశలో ఆత్మహత్యలకూ వెనకాడని విధంగా పరిస్థితి మారింది. ఈ వ్యవహారంపై 'ఈనాడు-ఈటీవీ' బృందం కొందరు బాధిత మహిళలతో మాట్లాడినపుడు అక్కడి పరిస్థితులు కళ్లకు కట్టారు. సంబేపల్లి మండలానికి చెందిన ఓ మహిళ తాను పడిన నరకయాతనను కన్నీటిపర్యంతమవుతూ వివరించారు. చివరకు తాను స్వస్థలానికి వచ్చిన వైనాన్ని ఆవేదనతో వివరించారు. లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన మరో మహిళ కుటుంబం తమ బిడ్డ రాక కోసం పడుతున్న బాధను కన్నీళ్లతో వివరించారు. ఇక్కడ ఒకరిద్దరు కాదు.. పదుల సంఖ్యలో ఎందరో అభాగ్యులు పరాయిదేశంలో కష్టాలు పడుతున్నారు.

విగతజీవులుగా వెనక్కి : పరాయిదేశంలో కష్టాలు పడి చివరకు విగతజీవులుగా వచ్చిన వాళ్లు ఉన్నారు. అనారోగ్య కారణాలతో కొందరు, రోడ్డు ప్రమాదాల్లో మరికొందరు.. చివరకు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది మరికొందరు.. ఇలా వివిధ కారణాలతో దేహం కుళ్లిపోయిన స్థితిలో వెనక్కి వస్తున్నారు. చూసి తట్టుకోలేక బాధిత కుటుంబాలు గుండె పగిలేలా రోదిస్తున్నారు. సరైన తిండి లేక చిత్రహింసలు తట్టుకోలేక కొందరు అనారోగ్యానికి గురై మృత్యువాతపడుతున్నారు. మృతదేహాల తరలింపు కష్టమవుతోంది. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతవర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. ఈ విషయమై జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీతో 'ఈనాడు' మాట్లాడగా గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే బంధం యాప్ ద్వారా గల్ఫ్‌కు వెళ్లిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నామని తెలిపారు. మోసాల ఏజెంట్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పాపయ్య పేరుతో ఏర్పడిన కర్ణపాపాయపల్లె

నాలుగు వందల సంవత్సరాల క్రితం కర్ణపాపాయపల్లె గ్రామానికి కర్ణాటక రాష్ట్రం నుంచి పాపయ్య అనే వ్యక్తి వలసవచ్చి ఇక్కడే స్థిరపడిపోయారు. తర్వాత ఊరు బాగా పెరిగిపోయింది. ఈయన కర్ణాటక నుంచి వలసవచ్చినందున 'కర్ణాటక'లోని తొలి రెండు అక్షరాలు, పాపయ్య అనే పేరునూ జతచేసి ఈ ప్రాంతాన్ని 'కర్ణపాపాయపల్లె'గా పిలవడం ఆరంభించారని ఇక్కడి పెద్దలు చెప్తారు. ఇంకో కథనం ప్రకారం.. కర్ణపాపయ్య అనే వ్యక్తి గ్రామంలోని ఓ ఇంటికి ఇల్లరికానికి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయారని, ఆయన పేరుతోనే ఈ ఊరును కర్ణపాపాయపల్లెగా పిలుస్తున్నారని చెప్తారు. అలాగే ఈ గ్రామానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. అప్పట్లో రవాణా వ్యవస్థ లేకపోవడంతో అనంతపురం-కడప జిల్లాల నడుమ కాలి నడకన, ఎడ్లబళ్లు, గుర్రాల మీద ప్రయాణాలు సాగించేవారు. వీరందరికీ గంగిరెడ్డి కుటుంబికులు గ్రామ ప్రవేశ మార్గంలో ప్రత్యేక విడిదిగృహాలను నిర్మించి, ఎంతమంది వచ్చినా ఆతిథ్యమిచ్చి లేదనకుండా రేయింబవళ్లూ కమ్మని భోజనం వండి వడ్డించేవారట. వారి వెంట ఉన్న పశువులకు పశుగ్రాసం సైతం అందించేవారట. అలనాడు వారు చేసిన దానధర్మాల గురించి ఇప్పటికీ ఇక్కడివారు కథలు, కథలుగా చెప్తారు. గంగిరెడ్డి కుటుంబికులు అప్పట్లో బాటసారుల కోసం నిర్మించిన విడిదిగృహాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచాయి. అపట్లో ధానధర్మాలతో ఈ గ్రామం రాష్ట్రవ్యాప్తంగా వినుతికెక్కింది.

- లింగాల, న్యూస్‌టుడే.

పేరులో'నేముంది'




దాన ధర్మాలకు సాక్ష్యంగా నిలిచిన విడిది గృహాలు ఇవే..

రాజమందిరం కాదు.. ఓ రైతు గృహం

ఎగువ లింగాల ప్రధాన వీధిలోకి వచ్చే కొత్త వ్యక్తులు అక్కడ రాజమందిరాన్ని తలపించే ఓ భవనం కనిపించగానే ఠక్కున ఆగిపోతారు. ఇక్కడే మిటి రాజమందిరం కన్పిస్తోందని ఆసక్తిగా నిలబడి చూస్తారు. ఉత్సుకతతో ఆ ఇంటి లోపలికి వెళ్లిన వారికి ఓ 25 సెంట్ల స్థలంలో నివాసం ఉండే ఓ రైతు కుటుంబం దర్శనమిస్తుంది. లింగాల తొలి సర్పంచి, దివంగత అలవలపాటి పెద్ద మునెయ్యగారి ఓబుళరెడ్డికి విభిన్నంగా ఇంటిని నిర్మాంచాలనే ఆలోచన వచ్చింది. దీంతో ఈ ఇంటి నిర్మాణానికి నడుంకట్టారు. 1946లో చెన్నై నుంచి కలపను రైలు బోగీలో కొండాపురం వరకూ తెప్పించారు. అక్కడి నుంచి ఎడ్లబళ్ల ద్వారా ఇంటివద్దకు చేర్చి, రంపాలతో కోయించి, ఇంటి నిర్మాణానికి వాడడంతో ఇది ఓ రాజ మందిరాన్ని తలపిస్తోంది. పై అంతస్థులో 4 గదులు, కింది భాగంలో రెండు గదులు, ఓ విడిది గదిని నిర్మించారు. ఈ ఇంటిని నిర్మించి 71 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఈ కట్టడం చెక్కుచెదరలేదు. ఇంటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో ఆ ఇంటి ఆవరణ ఎప్పుడూ గ్రామస్థులతో కళకళలాడుతూ కన్పిస్తుంది. గ్రామానికి కొత్త వ్యక్తులు ఎవరొచ్చినా ఈ ఇంటిని చూడనిదే వెనుతిరగరు.

- లింగాల, న్యూస్‌టుడే

మన చెంత చిరు వింత





ఆంగ్ల అక్షరాలను రాసి నేర్పిస్తున్న ఓ విద్యార్థిని

ఇతర విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిలిస్తున్న లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థినుల బృందం

నల్లబల్లపై లెక్కలు రాస్తూ.. నేర్పిస్తూ..

అక్షర సైన్యమా.. అందుకో ప్రణామం

మంచి చేయాలనే మనసుండాలే గానీ చేయడానికి లక్ష మార్గాలుంటాయ్.. కావాల్సిందల్లా దృఢమైన సంకల్పమే. కళాశాల.. ఉద్యోగం.. వ్యాపారం.. ఎక్కడున్నా అది కార్యక్షేత్రమే. సరదాలు వదిలి, ఓ పక్క డిగ్రీ కోర్సును అభ్యసిస్తూనే మరోపక్క మురికివాడల్లో, వసతిగృహాల్లో ఉండే పేద విద్యార్థులకు సాయంత్ర వేళల్లో చదువు (ట్యూషన్) చెబుతూ, వారిని విద్యలో మెరికల్లా తీర్చిదిద్దడం నిజంగా అద్భుతమే. ఆ పేద బాలలు పరీక్షల్లో విజయాలు సాధిస్తే, మంచి గుర్తింపు తెచ్చుకుంటే వీరు పొంగిపోతారు. వారు మోముల్లో విజయ దరహాసాన్ని చూసి ముగ్ధులవుతారు. తమ సమయాన్ని నిరుపేద విద్యార్థుల కోసం వెచ్చిస్తూ, వారి పురోభివృద్ధికి అహరహం కృషిచేస్తున్న ఆ యువ వెలుగు సైన్యమే.. పులివెందుల లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థినుల బృందం. వీరు తాముగా రూపొందించుకున్న 'అక్షరాస్యత కార్యక్రమం' ద్వారా చదువు, చైతన్య కార్యక్రమాలు చేపడుతూ పలు కళాశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సర్కారీ బడులు, వసతిగృహాల పిల్లలకు సాయంత్రవేళల్లో ఉచితంగా తరగతుల నిర్వహణ

సందేహాల నివృత్తి.. పాఠ్యాంశాల విశ్లేషణ

తల్లిదండ్రుల్లో చైతన్యాన్ని నింపుతూ..

2003 నుంచి తమదైన అక్షరాస్యత కార్యక్రమం ద్వారా ముందుకు సాగుతున్న యువతుల బృందం

సభ్యులు మారుతున్నా.. ఆగని సేవ



విద్య ప్రాముఖ్యతపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ..

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల శివారులోని లయోలా డిగ్రీ కళాశాలలో సుమారు 2 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా గ్రామీణ ప్రాంత వ్యవసాయ కుటుంబాలకు చెందినవారే. వీరిలో విద్యార్థినులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. సాధారణంగా పాఠశాలలు అయిపోగానే ఇళ్లు, వసతిగృహాలకు చేరుకొని పిచ్చాపాటి కబుర్లతో కాలక్షేపం చేస్తున్న అనేక మంది పేదింటి పిల్లలను వీరు ప్రత్యక్షంగా చూశారు. వారి తల్లిదండ్రులు వారికి ప్రైవేటు తరగతులు చెప్పించే ఆర్థిక స్థితి లేదని గ్రహించారు. దీంతో కొందరు విద్యార్థినులకు ఓ చక్కటి ఆలోచన వచ్చింది. సమయాన్ని వృథాచేసుకునే ఈ బడి పిల్లలకు కాస్తైనా విజ్ఞానాన్ని పంచి, వారి మార్గాన్ని మార్చితే వారి బతుకులు బాగుపడతాయని భావించారు. ఇలా 2003లో పురుడుపోసుకున్నదే వారి 'లిటరసీ ప్రోగ్రామ్'. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం డిగ్రీ కోర్సు అభ్యస్తున్న 17 మంది అమ్మాయిలు భాగస్వాములై సేవలు అందిస్తున్నారు.

పట్టణంలోని కళాశాల సమీపంలో ఉండే బాలికల వసతిగృహం, నగరిగుట్టవీధిలోని ఎస్సీ బాలుర వసతిగృహం, ఎర్రగుడిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలను వీరు దత్తత తీసుకున్నారు. గత మూడేళ్లగా ఈ పాఠశాల, వసతిగృహాల్లో ఉండే పేద విద్యార్థులకు క్రమంగా ఏడాది పొడవునా సాయంత్ర వేళల్లో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఎస్‌సీఎస్ వంటి పలు కోర్సులు అభ్యసిస్తున్న ఈ 17 మంది విద్యార్థినులు పాఠశాల స్థాయి విద్యార్థులకు సబ్జెక్టుల ప్రకారం పాఠ్యాంశాలను చక్కగా బోధిస్తున్నారు. గణితం, ఇంగ్లిషు, సైన్సు సబ్జెక్టులను అర్థమయ్యే రీతిలో నల్లబల్లపై రాస్తూ కూలంకషంగా వివరిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు పాఠ్యాంశాలను బోధిస్తారు. పాఠశాల తరగతిగదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను తిరిగి సాయంత్రం వేళల్లో 'లిటర్సీ ప్రోగ్రామ్' బృంద విద్యార్థినులు మరింత వివరంగా చెప్తుండడంతో ఆయా బడి పిల్లలు సబ్జెక్టులపై పట్టు సాధిస్తున్నారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వకరూ వీరు చక్కగా పాఠ్యాంశాలను బోధించడంతో పాటు.. పదిలో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు మెలకువలనూ అందిస్తున్నారు. అలాగే జీకే, సామాజిక విజ్ఞానం, చుట్టూవున్న సమాజంపై అవగాహనను కూడా పెంపొందిస్తున్నారు.

ఫలితాన్నిచ్చాయి

డిగ్రీ కళాశాల విద్యార్థినులు సాయంత్రవేళ్లలో పాఠ్యాంశాలను చక్కగా బోధించడంతో ఆయా వసతిగృహాల, బడుల విద్యార్థులు ప్రయోజకులుగా ఎదగడంతో పాటు మంచి ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఉదాహరణకు స్థానిక బాలికల వసతిగృహంలో 62 మంది విద్యార్థులు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యనభ్యసిస్తున్నారు. గతంలో వీరు సాయంత్ర వేళల్లో పాఠశాల నుంచి రాగానే పుస్తకాలను గదిలో వేసి ఎంచక్కా కబుర్లతో కాలంగడిపే వారు. దీంతో విద్యలో చాలా వెనుకబడేవారు. ఇది తెలుసుకుని లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఈ వసతిగృహంలో సాయంత్రవేళల్లో పాఠ్యాంశాల బోధించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏ,బీ,సీ,డీ విభాగాలుగా అక్కడి పిల్లలను విభజించుకుని పాఠ్యాంశాలను బోధిస్తూ, ఆంగ్లంలో అక్షరాలు రాయడం, చదవడాన్ని క్రమంగా నేర్పిస్తున్నారు. దీంతో రెండేళ్ల క్రితం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 20 మంది పరీక్ష రాస్తే.. 20 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో హిమగంగాజలి అనే విద్యార్థిని 9.6 పాయింట్లు సాధించింది. ఈ ఏడాది భార్గవి అనే విద్యార్థిని 8.8 పాయింట్లు సాధించింది.

యువ విద్యార్థినుల బృంద లక్ష్యాలు ఇవే..

1. విద్యను పలువురికి పంచుతూ, అనేక మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలి.
2. జీవితం ఎంతో అద్భుతమైనది. పలువురికి సాయం చేసినప్పుడే దానికి సార్థకత. అందువల్ల చేతనైనంత సాయం అందించడం..
3. విద్య ప్రాముఖ్యత తెలియక చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కూలిపనులకు పంపిస్తున్నారు. అలాంటి వారిలో మార్పు తేవాలన్నదే ప్రధాన ధ్యేయం.
4. ఓ వైపు డిగ్రీ కోర్సును అభ్యసిస్తూనే, మరో వైపు పాఠశాలస్థాయి విద్యార్థులకు బోధించడం ద్వారా బోధన భయం తొలగిపోతుంది. అనుభవం వస్తుంది. కొత్త విషయాలు అవగతమవుతాయి.
5. నాయకత్వ లక్షణాలను పెంపొదించుకోవడం..

అవగాహన ర్యాలీల ద్వారా తల్లిదండ్రుల్లో మార్పు

మగపిల్లలతో పాటు ప్రతి ఆడబిడ్డనూ చదివించాలని ప్రబోధిస్తూ ఈ లయోలా బృందం పల్లెల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా ఇళ్లకు వెళ్లి వీరు పెద్దలకు అవగాహన కల్పిస్తుండడం విశేషం.



నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చు



చదువు చెప్పడం, ఇతర సామాజిక చైతన్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చు. వేదికపై మాట్లాడే సమయంలో మనిషిలో కంగారు ఉండదు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో సేవా దృక్పథాన్ని అలవర్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమానికి పునాది వేశాను. నేను చదివే రోజుల్లో, అధ్యాపకుని వృత్తిలో కొనసాగే రోజుల్లో మురికివాడల్లో ఉండే పిల్లలకు ఉచితంగా విద్యాబుద్ధులు చెప్పేవాడిని. అదే మాదిరిగా కళాశాల యువత కూడా సేవ చేయాలనేది నా సంకల్పం. వారు దాన్ని ఆచరిస్తూ సమాజ దీపాలు భాసిస్తున్నారు.

- ఫాదర్ అమల్‌రాజ్, ప్రిన్సిపల్, లయోలా డిగ్రీ కళాశాల, పులివెందుల.

సేవ చేయాలన్నదే లక్ష్యం



జీవితంలో ఏదో రకంగా తోటి మనిషికి సాయం చేయాలన్నదే నా తపన. అందుకే నేను చదివిన విద్య తోటి వారి ఎదుగుదలకు దోహదపడుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నా. పాఠ్యాంశాలను బోధిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్తులో నేను ఉపాధ్యాయురాలినైతే.. ఇలాంటి పిల్లలకు ఉచితంగా బోధించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను ఆంగ్ల సబ్జెక్టును చక్కగా బోధించగలుగుతున్నా. **- సుధ, డిగ్రీ మూడో ఏడాది.**

ఎంతో ఆనందంగా ఉంది



పేద విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడం చాలా ఆనందంగా ఉంది. నేను సైన్సు సబ్జెక్టును బోధిస్తున్నా. సాయంత్ర వేళల్లో అనేకమంది పిల్లలు చదువుకోకుండా ఆడుకొంటూ, గమ్యం లేకుండా తిరుగుతుంటారు. ఇలాంటి పిల్లలందర్నీ క్రమశిక్షణలో పెట్టి, ప్రణాళికాబద్ధంగా బోధిస్తున్నాం. దీంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోంది. **- రాణి, డిగ్రీ మూడో ఏడాది.**

పాఠాలు చక్కగా అర్థమవుతున్నాయి



నా పేరు సుజాత. నేను పదో తరగతి చదువుతున్నా. గణితం అంటే చాలా భయం ఉండేది. తరగతిలో ఉపాధ్యాయుడు చెప్పిన లెక్కలు అర్థమవుతాయి. కానీ వసతిగృహానికి చేరుకోగానే వాటిని మరిచిపోతున్నా. ఇలాంటి సమయంలో కళాశాల విద్యార్థినులు సాయంత్ర వేళ్లలో పాఠ్యాంశాలు బోధించడం నాకు ఎంతగానో ఉపకరించింది. ఇప్పుడు లెక్కల్లో పట్టు సాధించా.

పిల్లల 'టీకా' ఉల్లాసం!

ప్రాణాంతక వ్యాధుల నివారణకు సర్కారు అందిస్తున్న ఎమ్మార్ టీకా మాకు రక్ష అని నినదిస్తూ ఆ బడిపిల్లలు వరుసలో వచ్చి టీకాలు వేయించుకోవడం ముచ్చటగొలిపింది. గురువారం తొండూరు గురుకుల పాఠశాలలోని 600 మంది విద్యార్థులకు ఈ టీకా వేశారు. తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా ఈ టీకా భద్రత ఇస్తుంది. దీన్ని వేయించుకునేందుకు టీకా పత్రాలతో వరుసలో నిలిచిన పిల్లలు భద్రత నినాదాలు చేస్తూ, చేతిలో ఉన్న పత్రాలు చూపుతూ వైద్య సిబ్బందిని ఉత్సాహపరిచారు.

- తొండూరు, న్యూస్‌టుడే.



టీకా పత్రాలతో వరుసలో నిలిచి, భద్రత నినాదాలు చేస్తున్న గురుకుల పాఠశాల పిల్లలు

హృదయాలను దోచే 'హరిత'కేంద్రం!

ఆర్టీపీపీకాలనీకి వెళ్లే రోడ్డు, కాలనీలోని రోడ్లకు ఇరువైపులా పచ్చటి సిరులు కనువిందుచేస్తున్నాయి. ఇక్కడికి కొత్తగా వచ్చే వారు ఈ హరిత అందాలను చూసి ముగ్ధులవుతున్నారు. విద్యుదుత్పత్తికేంద్ర కాలనీకి వచ్చే మార్గంలో, కాలనీలోని ఇళ్ల ముంగిట పెరిగిన పూలమొక్కలు వివిధ రకాల విరులకు నెలవై ముచ్చటగొల్పుతున్నాయి. కాలనీలోని గృహసముదాయాల్లో సుమారు వేయి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కేంద్రం లోపలిభాగంలో కూడా పచ్చదనం పరిఢవిల్లుతోంది. పాఠశాలల విద్యార్థులు, ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు వేల మొక్కలను నాటడంతో ఈ ప్రాంతమంతా ఓ పెద్ద హరితవనంలా మారింది. పర్యావరణ విభాగంలో ఆర్టీపీపీ మూడుసార్లు వరసగా 'గ్రీన్‌టెక్' అవార్డు సాధించడం విశేషం.

- ఆర్టీపీపీ (ఎర్రగుంట్ల), న్యూస్‌టుడే.



ఆర్టీపీపీకాలనీకి వెళ్లే మార్గంలో దట్టంగా పెరిగిన చెట్లు

మరుభూములకు మహర్దశ

శ్మశానవాటికలకు వెళ్లేందుకు దారులు ఉండవు. మృతదేహాలను తీసుకెళ్లాలంటే కిలోమీటర్ల దూరం నడవాలి. శ్రమతో అక్కడికి వెళ్లినా ఎలాంటి షెడ్లూ ఉండవు. చేతులు కడిగేందుకు కనీసం నీటి సదుపాయం కూడా లేకపోవడంతో ఇక్కట్ల నడుమే అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి.. వర్షాకాలం వచ్చిందంటే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికీ చాలా గ్రామాల్లో మరుభూమికి వెళ్లేదారి సరిగాలేక జనం నరకయాతన పడుతున్నారు.

ఒక్కోదాని అభివృద్ధికి సుమారు రూ.10 లక్షల చొప్పున ఉపాధి నిధులు

జిల్లాలో 126 శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు

సుమారు రూ.1225 లక్షల కేటాయింపు



తుమ్మలపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్మశానవాటికలోని భవనం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 50 మండలాల్లో 790 పంచాయతీలున్నాయి. పలుచోట్ల మరుభూములు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. శ్మశానవాటికలు సరిగాలేకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. వీటి అభివృద్ధికి ప్రభుత్వం ఇపుడు చొరవ చూపుతోంది.

జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 126 పంచాయతీల్లో శ్మశానవాటికల అభివృద్ధికి సుమారు రూ.1225 లక్షలు వెచ్చిస్తున్నారు. మొదటివిడతలో ఒక్కో శ్మశానవాటిక అభివృద్ధికి ఉపాధి నిధులు సుమారు రూ.10 లక్షలు వెచ్చించి నిర్మాణపనులు చేపట్టారు. అలాగే మరుభూముల అభివృద్ధికి ప్రవాసాంధ్రులు ముందుకురావాలని కూడా ప్రభుత్వం పిలుపునిచ్చింది. జిల్లాలోని మొత్తం పంచాయతీల్లో దశల వారీగా శ్మశానవాటికలను బాగుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సరైన దారులు లేకపోవడం, లోపల నిలిచేందుకు నీడ కొరవడడం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అధిక శాతం శ్మశానవాటికల్లో కనిపించడం లేదు. దీంతో మృతదేహాలను ఖననం చేసేందుకు, దహనం చేసేందుకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే మరుభూముల్లో కనీస సౌకర్యాలు ఉండాలని సర్కారు అభిలషిస్తోంది. తదనుగుణంగా అడుగులు వేస్తోంది.

చేయాల్సిన పనులు ఇవే..

- శ్మశనావాటికల్లో ఉపాధి నిధులతో ఏయే పనులు చేపట్టాలో ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు విడుదల చేసింది.
- ఒక్కో శ్మశానవాటిక అభివృద్ధికి ఉపాధి హామీ ద్వారా ఇచ్చే రూ.7 లక్షల నిధులతో మృతదేహాలకు అంత్యక్రియలు చేసే స్థలంలో నీడ కోసం షెడ్డును నిర్మించాలి.
- దుస్తులు మార్చుకునేందుకు మరో షెడ్డు ఏర్పాటు చేసుకోవచ్చు.
- ప్రధాన ద్వారంతో పాటు చుట్టూ బయోఫెన్సింగ్, లోపల మొక్కల పెంపకం, కూర్చునేందుకు బల్లలు వంటివి ఏర్పాటుచేసుకోవాలి.
- మరుభూములకు దారి లేకపోతే రోడ్డును కూడా ఏర్పాటుచేసుకోవచ్చు.
- 14వ ఆర్థికసంఘం నిధులతో ప్రతి శ్మశానవాటికలో అభివృద్ధికి రూ.3 లక్షల వరకూ వెచ్చించే వెసులుబాటు కల్పించారు.
- శ్మశానవాటికల్లో నీటి తొట్టెలు, ఇతర సదుపాయాలు కల్పించుకునేందుకూ వీలుంది.

అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశం



గ్రామాల్లోని మరుభూములను అభివృద్ధి చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. శ్మశానవాటికల అభివృద్ధిలో జనాన్ని కూడా భాగస్వాములను చేయడానికి స్వర్గపురి పేరుతో ప్రవాసాంధ్రులు ముందుకురావాలంటూ కూడా ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలు కూడా మరుభూమి అభివృద్ధికి చొరవ తీసుకోవాలి.

- మొగిలిచెండు సురేష్, డ్వామా అదనపు సంచాలకుడు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పథకం ద్వారా శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారు. ఎర్రగుంట్ల మండలంలో 28 శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు మంజూరుచేశారు. వీటిలో ఒకటి మాత్రం పూర్తయింది. మిగిలిన వాటిలో 18 శ్మశానవాటికలు చివరిదశలో ఉన్నాయి. శ్మశనావాటికలను అభివృద్ధి చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం.

- కంచంరెడ్డి శివకుమారి, ఎంపీడీవో, ఎర్రగుంట్ల.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ నాగరాజు

సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వ పథకాలు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: జిల్లాలో సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం అందించే ప్రతి ప్రభుత్వ పథకాన్ని అందించడం జరుగుతుందని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు నాగరాజు అన్నారు. జిల్లాలో 10 మండలాల్లో ఏపీఆర్‌ఐజీపీ అమలు చేస్తున్నామని, ఇందులో 17,550 మంది రైతులకు వివిధ పథకాలను అందిస్తామని పేర్కొన్నారు. గురువారం కడపలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యకు చెందిన రైతు మిత్రలకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో రైతుమిత్రలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఏపీఆర్‌ఐజీపీ ముఖ్య ఉద్దేశం పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, నికర ఆదాయాన్ని, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం, విలువ జోడింపు మార్కెటింగ్‌పై దృష్టి పెట్టడమని పేర్కొన్నారు. 10 మండలాల్లో 1250 గ్రూపులుగా 17,550 మంది రైతులను చేర్చి, వారికి వ్యవసాయ అనుబంధ రంగాలను ఏర్పాటు చేసి, జీవనోపాధులను పెంపొందించాలని సూచించారు. ఒక్కో గ్రూపుకు ప్రభుత్వం రూ.10 వేలు బ్యాంకులో జమ చేస్తుందని, వారి జీవనోపాధుల పెంపుదలకు నిధులను ఇస్తుందని చెప్పారు. ఈ పథకంలో ఇప్పటి వరకు 11,558 మంది రైతులను చేర్చామని, బ్యాంకులలో 64 శాతం ఖాతాలు తెరిపించడం జరిగిందన్నారు. రైతు మిత్రలు రైతులకు వనగూరే లాభాలను వివరించి, వారికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ రాధాదేవి, ఉద్యానశాఖ డీడీ ప్రసాద్, ఫిషరీస్ శాఖ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, ఏపీఎంలు, ఎఫ్‌పీజీలు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ధనాభివృద్ధికి శ్రావణ శుక్రవారం రోజు ఏం చేయాలి? వాస్తు దోషాలను సులభంగా తొలగించుకోవడం ఎలా?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: నువ్వే కావాలి (తరుణ్, రిచా).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమఘుమలు 'కాజూ మటర్ పన్నీర్', మీచేతి వంట 'బీట్‌రూట్ కుర్మా', 'గోబీ పుదీనా రైస్', జస్ట్ ఎ మినిట్ 'కొబ్బరి నువ్వుల బర్ఫీ' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: వీర (రిపీట్), 05-30: ఆడాళ్ళూ మజాకా! (హైదరాబాద్ - సఫిల్‌గూడ అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో...), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్: కంప్లీట్ కామెడీ షో, 10-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం..

ఈటీవీ ప్లస్

ఉదయం
11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం
12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 గీత...సుబ్రమణ్యం రిపీట్
01:15 ఎవడి గోల వాడిదే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 పటాస్ పంచెస్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్ రిపీట్
09:00 పటాస్ రిపీట్
09:30 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు
09:45 టాప్స్
10:00 గీత...సుబ్రమణ్యం
10:15 ఎవడి గోల వాడిదే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ. 6:00, సా. 5:00 రా. 11:00)
- ★ ఆయుష్ (ఉ. 6:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 5:30, రా. 10:30,11:30)
- ★ హెల్దీ & టేస్టీ – హెల్దీ డయాబెటిక్ (ఉ. 7:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ - (ఉ. 8:30, మ. 1:00, సా. 6:00, రా. 8:30)
- ★ డా. ఈటీవీ – (ఉ. 9:00, 11.00, మ. 3:30, రా. 7:30)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 9:30)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖజీవనం (ఉ. 10:00)
- ★ ఆరోగ్యమస్తు - (ఉ. 10:30, మ. 1:30, 3:00, రా. 9:00)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హోమియో - (మ. 2:00, రా. 7:00)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (మ. 2:30, సా. 4:00, రా. 9:30).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొరగారి దొంగ పెళ్ళాం (కృష్ణ, విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: అమరజీవి(ఏన్నార్,జయప్రద), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: అమ్మో ! ఒకటో తారీఖు (శ్రీకాంత్, రాశి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: చట్టం (రాంకీ, విజయశాంతి), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: భక్తపోతన (నాగయ్య), 10-00: సెకండ్ షో: అల్లుడుగారూ జిందాబాద్ (శోభన్‌బాబు).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – రాగి నువ్వుల కజ్జికాయలు & వామాకు నువ్వుల బజ్జీ, ఉ.9.30: పిండివంటలు, ప్రసాదాలు – నవరతన్ లడ్డు & గుమ్మడిపండు చలిమిడి, ఉ.10.00, రా.7:00: అతిథి – మీ ఇంటింటి నేస్తం, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – హోమ్ మేడ్ సెరిలాక్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పీనట్ బట్టర్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - గోధుమ ప్రసాదం & పూర్ణం బూరెలు, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - నువ్వుల పప్పు చెక్కలు, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – చంద్రకాంత గవ్వలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - బంగాళదుంప పర్వల్ కూరగాయల వేపుడు, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఫ్రైడ్ గోబీ గార్లిక్, మ.1.00: వావ్ ఏమి రుచి (జర్మన్ క్యూసైన్) – కోకోనట్ కర్రీ ఫ్రైడ్ చికెన్ & స్టిర్ ఫ్రైడ్ వెజిటబుల్స్ ఇన్ కోకోనట్ మిల్క్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) మొక్కజొన్న పొట్లాలు, మ.1.45, రా.7.30: రోడ్ సైడ్ రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – చికెన్ స్ట్రిప్స్ (ఒవెన్ స్పెషల్), మ.2.30: చోటా షెఫ్ – శెనగపప్పు పాయసం, సా.5.15: స్నాక్స్ – గుమ్మడి బిల్లలు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ మహాలక్ష్మి ఆలయం, కొల్హాపూర్, మహారాష్ట్ర, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ(రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ మహంకాళి దేవాలయం, తూప్రాన్, మెదక్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 11-08-2017

SVBC — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (అభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - మహాలక్ష్మి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 లైవ్ అమ్మవారి అభిషేకం, **సాయంత్రం:** 00-00 లలితాసహస్రనామస్తోత్ర పారాయణం, 04-30 మహాలక్ష్మి వైభవం - ప్రవచనం - చక్రవర్తి రంగనాథ్, 05-00 లైవ్ ఎస్.డి. సేవ తిరుమల, 06-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుచూర్, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కల్యాణోత్సవం, 08-00 భక్తుల అనుభవాలు, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - పెద్దింట్లమ్మవారు - కొల్లేటికొండ, 09-30 శ్రీ దేవీ సప్తశతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీలక్ష్మి అభిషేకం (లైవ్), 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణ శుక్రవార వైభవం (లైవ్), 09-00 లక్ష్మీ కటాక్షం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 శ్రీ లలితాసహస్రం, 06-00 శ్రీపురం గోపూజ (లైవ్), **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee — **ఉదయం:** 07-30 అభిషేకం, 08-00 సినిమా: బ్రదర్స్, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: సౌఖ్యం.

maa — **ఉదయం:** 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్ టైమ్, 09-00 సినిమా: చంద్రముఖి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 03-30 సినిమా: మనమంతా, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 06-30 శ్రీ కరుణామయి దేవీ వైభవం, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: శ్వేతనాగు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: దిల్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: దృశ్యం.

HBO — ఉదయం: 06-00 న్యూ ఇయర్స్ ఈవ్, 08-18 లైట్స్ అవుట్, 09-42 ఫుల్ మెటల్ జాకెట్, 11-27 టీనేజ్ మూటెంట్ నింజా టర్టెల్స్, మధ్యాహ్నం: 01-22 స్టార్ ట్రెక్ ఇంటూ డార్క్‌నెస్, 03-46 స్టెప్ అప్, సాయంత్రం: 05-27 షావోలిన్ సాకర్, 07-08 విస్కీ టాంగో ఫాక్స్‌ట్రాట్, రాత్రి: 09-00 కుంగ్ ఫూ పాండా 2.

రైతేరాజు

ETV అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు

1. పత్తిలో రసంపీల్చు పురుగులు - సమగ్ర నివారణ
2. పాలకూర సాగులో మెలకువలు
3. చెరకును ఆశించే తెగుళ్లు - యాజమాన్య పద్ధతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు

ETV ఆంధ్రప్రదేశ్ జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. అనంత రైతులను దెబ్బతీసిన నాసిరకం మొక్కజొన్న విత్తనాలు
2. గుంటూరు జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలన సదస్సుల ద్వారా అవగాహన

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పచ్చిరొట్ట సాగుతో పచ్చని పంటలు

రైతులు తాము సాగు చేస్తున్న పైర్లలో విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగంతో భూములు సారం కోల్పోతున్నాయి. పంట దిగుబడులు తగ్గి రైతు ఆర్థికంగా నష్టపోతున్నాడు. ఈ తరుణంలో భూసారం పెంచాలంటే రైతులు సేంద్రియ ఎరువుల సాగుపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వం కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టింది. రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, వానపాముల ఎరువు తయారీ యూనిట్లు తదితరాలు రైతులకు అందుబాటులో ఉంచింది.

★ తక్కువ ఖర్చుతో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పచ్చని పైర్లు పెంచవచ్చు. ఖరీఫ్ సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్ల సాగు చేపట్టి, ఆ తరువాత ముఖ్య పంటలు సాగు చేస్తే.. నాణ్యమైన దిగుబడులు రాబట్టుకోవడంతో పాటు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి రైతుకు పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయి. భూసారం పెరిగి తద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండి, ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ పచ్చిరొట్ట సాగుపై రైతుల్లో అవగాహన కల్పించే చర్యలు చేపట్టింది. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ 12 కిలోలు, కట్టె జనుము 16 కిలోలు ఒక ఎకరాకు వేయాలని వ్యవసాయాధికార్లు సూచిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయశాఖ పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై రైతులకు అందించింది.



కట్టె జనుము పైరు

★ వెదజల్లే విధానంలో పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టేందుకు అవకాశం లేదు. కేవలం దమ్ము చేసి నాట్లు వేసే పొలంలో మాత్రమే పచ్చిరొట్ట సాగు చేపట్టాలి. తొలకరి వర్షాల ప్రారంభంలో పొలాన్ని దున్ని పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి. ఊడ్పులకు ముందుగా ఏపుగా పెరిగిన పచ్చిరొట్ట మొక్కలను దమ్ముచేసి, వారం పాటు బాగా కుళ్లనిచ్చి ఆ తరువాత నాట్లు వేసుకుంటే పైర్లు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. పచ్చిరొట్ట సాగుచేసిన పొలాల్లో చీడపీడల తాకిడి తక్కువగా ఉండి, పైర్లు ఆరోగ్యవంతగా పెరిగి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ సూచిస్తోంది.

'75 శాతం రాయితీపై జీలుగ, కట్టెజనుము విత్తనాలను రైతులకు అందించాం. చాలా మంది రైతులు ఆసక్తి కనబరిచి పచ్చిరొట్ట సాగు చేపట్టారు. పచ్చిరొట్ట పైర్లను పూత దశలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పైర్లకు అవసరమైన సూక్ష్మపోషకాల లభ్యత పెరిగి, నాణ్యమైన దిగుబడులు రాబట్టుకోవచ్చు. సాధారణం కంటే పచ్చిరొట్ట సాగుచేసిన పైర్లలో పంట దిగుబడులు అధికంగా ఉంటాయ'ని వ్యవసాయాధికారి వి.శ్రీనివాసరావు చెప్పారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

చెరకులో లద్దె పురుగుల నివారణ

చెరకు సాగులో లద్దె పురుగు వల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ పురుగు నివారణకు ముందుగానే చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని పశ్చిమగోదావరి జిల్లా టి.నరసాపురం మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు.



లద్దె పురుగులు ఆశించడంతో ఎండుతున్న చెరకు పంట

చెరకు సాగులో తేమ వల్ల లద్దెపురుగు ఆశిస్తుంది. తేమ తక్కువైన సమయంలో మొక్క మొదలుకు వెళ్లి అక్కడ చెరకు వేర్లను తిని బతుకుతుంది. అక్కడే గుడ్లు పెట్టి సంతతిని పెంచటం వల్ల మొత్తం చెరకు పొలం ఎండిపోతుంది. ఈ పురుగు నివారణకు.. ముందుగా దుక్కిలో ఫోరేట్ గుళికలు 8 కిలోలు వేసి నీరు పెట్టాలి లేదా నాటిన నెలరోజుల్లోపు సాళ్ల మధ్య గుళికలు వేసి నీరు పెట్టడం వల్ల లద్దె పురుగు ఆశించదు. పైరు పెరిగాక లద్దె పురుగు బెడద ఉంటే చేలో బాగా నీరు నిల్వ ఉండేలా చేసి అందులో ఎకరాకు మూడు లీటర్ల ఇంజిన్‌లో వాడిన ఆయిల్(మడ్డి ఆయిల్)ను ఎకరాకు మూడు లీటర్లు చల్లటం వల్ల పురుగు చనిపోతుంది.

– న్యూస్‌టుడే, టి.నరసాపురం (ప.గో.జిల్లా)

రాయచోటిలో కుంభవృష్టి

- రెండ్రోజుల్లో 226.84 మిల్లీమీటర్లు వర్షం
- పొంగిన వాగులు, వంకలు
- ప్రవహించిన మాండవ్య నది
- దెబ్బతిన్న పంటపొలాలు, పూరి గుడిసెలు
- రహదారులపై స్తంభించిన రాకపోకలు



అబ్బవరంలో కొట్టుకుపోయిన పాత చెక్‌డ్యాం



మాండవ్యనదిలో జలకళ

రాయచోటి(రాయచోటి పట్టణం), న్యూస్‌టుడే: రాయచోటి నియోజకవర్గంలో గురువారం రాత్రి కుంభవృష్టి కురిసింది. రెండు రోజులుగా కురిసిన వర్షానికి కరవు నేల తడిసిముద్దగా మారింది. తీవ్ర వర్షాభావంతో రగిలిపోతున్న కర్షకుల మోములో వర్షాతిరేకం ఎత్తించింది. ఒకవైపు వర్షం వచ్చిందన్న ఆనందం మిగిలినా చిన్నపాటి నష్టం సంభవించింది. బుధ, గురువారాల్లోనే రాయచోటి ప్రాంతంలో 226.84 మిల్లీ మీటర్ల వర్షపాతం రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడం విశేషం. రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి మండలాల్లోనే అత్యధిక వర్షం కురవగా గాలివీడు, సుండుపల్లి మండలాల్లో పదునుకు మించి వర్షం కురవలేదు. రాయచోటి పట్టణంలో వర్షపు దాటికి మురుగు కాలువలు పొంగిపొర్లాయి. కాలువలపై ఇసుక మేటలు వేయడంతో వర్షపు నీరు పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లలోకి ప్రవేశించింది. ప్రధానంగా పట్టణంలోని శ్రీవీరభద్రస్వామి కోనేటి ప్రాంతంలోకి ఎక్కువగా నీరు చేరడంతో కోనేరు నిండిపోయి సమీపంలోని ఇళ్లలోకి చేరింది. మండలంలోని దిగువ అబ్బవరం, చెన్నముక్కపల్లి, ఎగువ అబ్బవరం, శిబ్యాల, సంబేపల్లె మండలంలోని దుద్యాల, శెట్టిపల్లె ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు పొంగాయి. శిబ్యాల చెరువుకు భారీగానే నీరు చేరింది. రాయచోటి పరిసర ప్రాంతాల్లోని చిన్నపాటి కుంటలు నిండిపోయాయి. వాగుల నుంచి వచ్చి చేరిన నీటితో మాండవ్య నదిలో వరదనీరు పారింది. సద్దికూళ్ల వంక ఉద్ధృతికి రాజంపేట-రాయచోటి ప్రధాన రహదారిలో రాకపోకలు కొన్ని గంటల పాటు ఆగిపోయాయి. రాయచోటి-గాలివీడు మార్గంలోని మాండవ్య నది వంతెనపై వరదనీరు భారీగా పారడంతో స్వల్పంగా దెబ్బతింది. విద్యుత్తు నియంత్రిక వరిగిపోవడంతో తీగలు నీటిలో తేలియాడాయి. ఆ సమయంలో సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దిగువ అబ్బవరంలో సాగులో ఉన్న సజ్జ పంటను వరదనీరు ముంచెత్తింది. చెన్నముక్కపల్లి, కుమ్మరపల్లి ప్రాంతాల్లో పంట పొలాలపై వర్షపు నీరు పారడంతో వేరుసెనగతో పాటు వరినార్లు, సజ్జ పంటకు కొంత నష్టం వాటిల్లిందని తహశీల్దారు గుణభూషణ్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై తారు లేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. రూ. 280 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులకు కొంత మేర నష్టం జరిగిందని గుత్తేదారులు వాపోయారు. రహదారుల తాత్కాలిక మరమ్మతులకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొంటామని ఆర్‌అండ్‌బి డీఈ సురేష్‌నాయక్ పేర్కొన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, నేతలు : రాయచోటి పురపాలికలో వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాలను కమిషనర్ బి.ప్రసాద్‌రాజుతో పాటు ఛైర్మన్ నసీబూన్‌ఖానం, తహశీల్దారు గుణభూషణ్‌రెడ్డి పరిశీలించారు. బాధితులను ఆదుకొంటామని భరోసా ఇచ్చారు. మరో రెండురోజులు భారీ వర్ష సూచన ఉండడంలో ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వీఆర్వోల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశామని తహశీల్దారు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వరద దృష్ట్యా పట్టణంలో జనవాసానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు. వర్షపు నీటితో ఇళ్లు, పంటలు దెబ్బతిన్న వారిని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కె.రామాపురంలో దెబ్బతిన్న గోడలు, లోతట్టులో నీట మునిగిన ప్రాంతాలను తెదేపా నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు పరిశీలించారు.

వీరబల్లిలో 61 మి.మీ.ల వర్షం / మాండవ్యలో నీటి ప్రవాహం





మాండవ్యలో నీటి పరవళ్లు.. పెద్దివీడు ఉప్పేటి వంక వద్ద ఉన్న వంతెనపై ప్రవాహం

వీరబల్లి, న్యూస్‌టుడే : వీరబల్లి మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వంకలు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. బుధవారం రాత్రి 52 మి.మీ, గురువారం రాత్రి 61 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షంతో ఎడారిని తలపిస్తున్న మాండవ్యలో నీరు ప్రవహించింది. నదిలో నీరు పారితే తాగు, సాగునీటి సమస్య పెరుగుతుందని మండల ప్రజలు చెబుతున్నారు. పెద్దివీడు ఉప్పేటివంక, రాగిమానుదిన్నెపల్లె, ముప్పాలవారిపల్లి గ్రామాల వద్ద ఉన్న వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. మండలంలోని పలు గ్రామాల్లో వంకలు, చెక్‌డ్యాంలోకి నీరు చేరింది. కొన్నిచోట్ల వరిపంట నీట మునిగి చాలామంది రైతులు నష్టపోయారు. మండలంలో ఓదివీడు, సంగంవారిపల్లి పంచాయతీ మంగళపల్లి గ్రామాల్లో పలువురు సాగుచేసిన వరిపంట నీట మునిగింది. ఈ వర్షం వరి సాగుకు ఉపకరించడంతో పాటు ఎండిపోతున్న మామిడిచెట్లకు ప్రాణం పోసిందని రైతులు పేర్కొంటున్నారు.

వాన వరదైంది.. సంత చెరువైంది

రాజంపేట నేరవార్తలు, న్యూస్‌టుడే : రాజంపేట పట్టణంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షం స్థానిక మార్కెట్‌ను ముంచెత్తింది. మార్కెట్ పల్లపు ప్రాంతంలో ఉండడంతో ఎగువ ప్రాంతాల్లో పడిన వాననీరు, మురుగు నీరంతా ఒక్కసారిగా దూసుకొచ్చింది. దీంతో కూరగాయల మార్కెట్ ప్రాంతం మొత్తం జలమయమైంది. కూరగాయలన్నీ నీట మునిగి పనికిరాకుండా పోయాయి. దుకాణాల్లోకి సైతం జలం చేరడంతో వ్యాపారులు అష్టకష్టాలు పడ్డారు. వరదనీటిలో పెద్ద ఎత్తున కూరగాయలు కొట్టుకుపోయాయి. దుకాణాలకు వేలాది రూపాయల అద్దెలు చెల్లిస్తున్నా తగిన సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మార్కెట్‌ను మురుగునీరు ముంచెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసిన రోజు తమకు కూలీ సైతం గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



వర్షం నీటిలో మునిగిన కూరగాయలు

రామయ్య భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం

- బృహత్తర ప్రణాళికతో ముందడుగు
- ఒంటిమిట్టలో దశల వారీగా అభివృద్ధి పనులు
- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఏకశిలానగరి ఎంతో పవిత్ర పుణ్యస్థలి. ఈ ఆధ్యాత్మిక దివ్య క్షేత్రం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. కోదండ రాముడి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు బృహత్తర ప్రణాళికను రూపొందించాం. వేగంగా పనులు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నాం. నిధులకెలాంటి కొరత లేదు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని.. తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని గురువారం ఈవోతో పాటు సంయుక్త కార్యనిర్వాహణాధికారి పోలా భాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఈ ఆలయాన్ని తితిదేలోకి విలీనం చేసి రెండేళ్లు అవుతోంది. ఇప్పటికే కొన్ని పనులు చేపట్టాం. ఇంకా ఎన్నో చేపట్టాల్సి ఉంది. మొన్నటిదాకా జాతీయ పురావస్తుశాఖ నుంచి అనుమతి రాలేదు. దీంతో నిర్మాణ పనులను చేపట్టలేకపోయాం. తితిదే నుంచి పంపిన ప్రతిపాదనలకు దిల్లీలో రెండు వారాల క్రితం ఆమోదముద్ర వేశారు. ఇక్కడ ఏం చేయాలనేది ఇప్పటికే ప్రణాళికను రూపొందించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి మార్పులు చేయాలో తెలుసుకునేందుకే ఇక్కడికి వచ్చారని చెప్పారు. ఆలయం ముంగిట పుష్కరిణి, పరిపాలన భవనం, యాత్రికుల విడిదికి వసతి గదుల సముదాయం, తాగునీరు, టిక్కెటు విక్రయ కేంద్రం, లాకర్లు, ఉద్యానవనం, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం రూ. 14.50 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశాం. వీలైనంత త్వరగా పనులు చేపట్టి బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేస్తాం. ఇక్కడ తాత్కాలికంగా ఏం చేయాలి. శాశ్వతంగా ఏయే పనులు చేపట్టాలని ఇప్పటికే చర్చించాం. 15 రోజుల్లో తుది ప్రణాళికను రూపొందించి ఆమోదిస్తామని ఈవో వివరించారు.



పరిపాలన భవనం, ఉద్యాన వనంపై ఇంజినీర్లతో చర్చిస్తున్న ఈవో అనిల్‌కుమార్, జేఈవో పోలా భాస్కర్

డిప్యూటీ ఈవోను నియమిస్తాం : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పరిపాలన సౌలభ్యం కోసం ఉప కార్యనిర్వాహణాధికారి నియమించాలని నిర్ణయం తీసుకున్నాం. త్వరలో సమర్థుడైన అధికారిని ఇక్కడికి తీసుకొస్తామన్నారు. ఆలయం ఉత్తర, ఈశాన్య దిశలో మాడ వీధుల పనులు పూర్తి చేయాలంటే భూసేకరణ చేయాల్సి ఉందని జేఈవో పోలా భాస్కర్ ఈవో దృష్టికి తీసుకెళ్లారు. కొంతమంది ఇళ్లు ఉన్నాయి. పరిహారం న్యాయబద్ధంగా ఇస్తామని చెప్పాం. భూసేకరణపై తిరుపతిలో డీఎస్పీగా పనిచేస్తున్న రామ్మోహన్‌తో ఈవో చర్చించారు. ఈ ఊరు మీదే. ఇక్కడి అభివృద్ధి జరగాలంటే మీరంతా సహకరించాలి. గ్రామస్థులను ఒప్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆలయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై స్థానిక యంత్రాంగాన్ని నిలదీశారు.

నిర్ణీత గడువులో ఎందుకు పూర్తిచేయలేదు

కల్యాణ వేదిక సమీపంలో చేపట్టిన యాత్రికుల విడిది సముదాయాన్ని నిర్ణీత గడువులో ఎందుకు చేపట్టలేదని సీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ కృష్ణారెడ్డిని ఈవో గట్టిగా ప్రశ్నించారు. గడువు ముగిసి మూడు వారాలైనా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిదానంగా చేసిన గుత్తేదారు నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారా, చేస్తే ఎంతమేర రాబట్టాలని నిబంధనలు చెబుతున్నాయో పరిశీలించాలని ఆదేశించారు. గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఈలు రాములు, వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో శివరాంప్రసాద్, ఎస్టేట్ అధికారిణి గౌతమి, డీఈలు రాఘవయ్య, నరసింహారెడ్డి, అదనపు ఆరోగ్యశాఖాధికారి సునిల్, సహాయ, ఉప కార్యనిర్వాహణాధికారులు శంకర్‌రాజు, సుబ్రమణ్యం, పర్యవేక్షకుడు కేవీ లక్ష్మీనాగారాజు, ఏఈలు ప్రసన్నకుమార్, జనార్ధన్ పాల్గొన్నారు.

జగదభిరాముడిని దర్శించుకున్న ఈవో..

ఈసందర్భంగా తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో పోలా భాస్కర్ కోదండ రామాలయాన్ని సందర్శించారు. సహాయ, ఉప కార్యనిర్వాహణాధికారులు శంకర్‌రాజు, సుబ్రమణ్యం, పర్యవేక్షకుడు లక్ష్మీనాగరాజు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణ మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర

ప్రతిభ



★ స్వామి వివేకానందుడు 'అన్ని జాతుల్లో ఉన్న పేదలే నేను విశ్వసించే ఏకైక దైవం' అని పేర్కొన్నారు.

★ 1893 లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన కార్యక్రమంలో స్వామి వివేకానంద హిందూ మత గొప్పతనం గురించి ప్రసంగించారు.

'సతి' విధానాన్ని రద్దు చేసింది ఎవరు..?

సాంఘిక, మత సంస్కరణలు ఉద్యమాలు

1. 1828 లో బ్రహ్మసమాజాన్ని స్థాపించింది ఎవరు?
1) దయానంద సరస్వతి
2) కేశవ చంద్రసేన్
3) దేవేంద్రనాథ్ ఠాగూర్
4) రాజా రామమోహన్‌రాయ్

2. బ్రహ్మ సమాజానికి కార్యదర్శిగా పని చేసిన వ్యక్తి ఎవరు?
1) కేశవ చంద్రసేన్ 2) రామచంద్ర విద్యావాగీష్
3) దేవేంద్రనాథ్ ఠాగూర్ 4) తారాచంద్

3. రాజా రామమోహన్‌రాయ్ కృషి ఫలితంగా 1829 లో సతి విధానాన్ని రద్దు చేసింది ఎవరు?
1) విలియం జోన్స్ 2) విలియం స్లీమెన్
3) విలియం బెంటింక్ 4) లార్డ్ డల్హౌసీ

4. రాయ్ జీవిత కథను రాసింది ఎవరు?
1) సోఫియా డాబ్సన్ కోలెట్ 2) విలియం డిగ్బీ
3) హెన్రీ డెరోజియో 4) తారాచంద్

5. బ్రహ్మధర్మం అనే గ్రంథాన్ని రచించింది ఎవరు?
1) దేవేంద్రనాథ్ ఠాగూర్ 2) ద్వారకనాథ్ ఠాగూర్
3) రవీంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు

6. 1872 లో స్వదేశస్థుల వివాహ చట్టం రావడానికి కృషి చేసిన భారతీయుడు ఎవరు?
1) రాజా రామమోహన్‌రాయ్
2) కేశవ చంద్రసేన్
3) ఈశ్వరచంద్ర విద్యాసాగర్
4) రామచంద్ర విద్యావాగీష్

7. భారతదేశంలో తొలి కార్మిక పత్రిక 'శ్రమజీవి'ని ఎవరు స్థాపించారు?
1) బాబూ శశిపాద బెనర్జీ 2) కేశవ చంద్రసేన్
3) ఆత్మారాం పాండురంగ
4) ఈశ్వరచంద్ర విద్యాసాగర్

8. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషి ఫలితంగా చేసిన చట్టం?
1) సతి రద్దు చట్టం
2) బాల్య వివాహాల నిషేధ చట్టం
3) నరబలి రద్దు చట్టం
4) వితంతు పునర్వివాహ చట్టం

9. భారతదేశంలో తొలి వితంతు పునర్వివాహం 1856 లో ఏ నగరంలో జరిగింది?
1) రాజమండ్రి 2) కాకినాడ 3) కలకత్తా 4) బొంబాయి

10. దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించింది ఎవరు?
1) ఆత్మారాం పాండురంగ 2) ఎం.జి. రనడే
3) ఆర్.జి. భండార్కర్ 4) పండిత రమాబాయి

11. 1873 లో సాధారణ ధర్మసభను స్థాపించింది ఎవరు?
1) ఆనందమోహన్ బోస్ 2) కేశవ చంద్రసేన్
3) బాబూ శశిపాద బెనర్జీ 4) శివనాథశాస్త్రి

12. సులభ్ సమాచార్ పత్రికను నడిపింది ఎవరు?
1) బాబూ శశిపాద బెనర్జీ 2) కేశవ చంద్రసేన్
3) దేవేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు

13. వితంతు వివేకం, బెంగాల్ చరిత్ర లాంటి గ్రంథాలను రచించింది ఎవరు?
1) ఈశ్వరచంద్ర విద్యాసాగర్
2) రాజా రామమోహన్‌రాయ్
3) కేశవ చంద్రసేన్ 4) శశిపాద బెనర్జీ

14. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసింది ఎవరు?
1) కేశవ చంద్రసేన్
2) రఘుపతి వెంకటరత్నం నాయుడు
3) కందుకూరి వీరేశలింగం 4) సత్యమూర్తి

15. బొంబాయిలో 'శారదాసదన్'ను స్థాపించింది ఎవరు?
1) సావిత్రిబాయి పూలే
2) పండిత రమాబాయి సరస్వతి
3) తారాబాయి షిండే 4) ఉన్నవ లక్ష్మీబాయమ్మ

16. 'లోకహితవాది'గా పేరొందిన వ్యక్తి ఎవరు?
1) రఘుపతి వెంకటరత్నం 2) రఘుపతి వెంకయ్య
3) కందుకూరి వీరేశలింగం
4) గోపాల్ హరిదేశ్‌ముఖ్

మీ అభిప్రాయాలు పంపాల్సిన ఈమెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net



- రచయిత
బి. నాగరాజు
అసిస్టెంట్ ప్రొఫెసర్

17. కిందివారిలో విభిన్నమైన వారిని గుర్తించండి.
1) డి.కె. కార్వే 2) ఆత్మారాం పాండురంగ
3) ఎం.జి. రనడే 4) ఆర్.జి. భండార్కర్

18. 'వేదాలకు మరలండి' అనే నినాదాన్ని ఇచ్చినవారు?
1) స్వామి వివేకానంద 2) స్వామి విరజానంద
3) స్వామి దయానంద 4) రాజా రామమోహన్‌రాయ్

19. దయానంద సరస్వతికి సంబంధించి సరికానిది ఏది?
1) సత్యార్థ ప్రకాశిక గ్రంథాన్ని రచించారు
2) సాంఘిక శుద్ధి ఉద్యమాన్ని నడిపారు
3) బోధనలు హిందీలో, రచనలు సంస్కృతంలో సాగాయి
4) అన్నీ సరైనవే

20. ఆర్య సమాజ గురుకులశాఖ ప్రధాన కేంద్రం ఏది?
1) కేదార్‌నాథ్ 2) హరిద్వార్
3) లాహోర్ 4) గంగోత్రి

21. దయానందుడి అనంతరం ఆర్య సమాజాన్ని నడిపింది, నాయకత్వం వహించింది ఎవరు?
1) లాలా లజపతిరాయ్ 2) లాలా హంసరాజ్
3) స్వామి విరజానంద 4) స్వామి శ్రద్ధానంద

22. 'పురోహితులు మహా అపవిత్రులు, పండితులు పురోహితుల కన్నా భ్రష్టులు, అజ్ఞానులు' అన్నదెవరు?
1) స్వామి శ్రద్ధానంద 2) లాలా లజపతిరాయ్
3) గోపాల్ హరిదేశ్‌ముఖ్ 4) ఎం.జి. రనడే

23. దయానంద్ ఆంగ్లో వైదిక కళాశాలను ఎక్కడ స్థాపించారు?
1) హరిద్వార్ 2) లాహోర్
3) పెషావర్ 4) అడయార్

24. 'నదులన్నీ సముద్రంలో కలిసినట్లే, మతాలన్నీ భగవంతుడిలో విలీనమవుతాయి' అన్నదెవరు?
1) స్వామి దయానంద 2) స్వామి వివేకానంద
3) రామకృష్ణ పరమహంస 4) అనిబిసెంట్

25. 'ప్రబుద్ధ భారత్' అనే ఆంగ్ల పత్రికను నిర్వహించింది ఎవరు?
1) స్వామి వివేకానంద 2) రామకృష్ణ పరమహంస
3) శిశిర్‌కుమార్ ఘోష్ 4) కేశవ చంద్రసేన్

26. 1878 లో సాధారణ బ్రహ్మ సమాజాన్ని స్థాపించింది ఎవరు?
1) శివనాథశాస్త్రి 2) ఆనంద్‌మోహన్ బోస్
3) 1, 2 4) ఎవరూ కాదు

27. 1875 లో అమెరికాలోని ఏ నగరంలో దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించారు?
1) శాన్‌ఫ్రాన్సిస్కో 2) వాషింగ్టన్
3) న్యూయార్క్ 4) మిసిసిపి

28. అలీఘర్ ఉద్యమాన్ని నిర్వహించింది ఎవరు?
1) సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్
2) నవాబ్ అబ్దుల్ లతీఫ్
3) ధర్మ్‌నిజామి 4) షరియతుల్లా

29. 'సుందర భారత వధువుకు హిందువులు, ముస్లింలు రెండు కన్నుల లాంటి వారు' అన్నదెవరు?
1) జిన్నా 2) సయ్యద్ అహ్మద్‌ఖాన్
3) మహ్మద్ ఇక్బాల్ 4) మౌలానా అబ్దుల్ కలాం

30. నామ్‌ధారీ ఉద్యమానికి నాయకుడు ఎవరు?
1) భాయి దయాల్‌సింగ్ 2) భాయి దర్బార్‌సింగ్
3) భాయి రాంసింగ్ 4) భాయి సుందర్‌సింగ్

31. ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించిందెవరు?
1) పి. త్యాగరాయ చెట్టి 2) జ్యోతిరావు పూలే
3) రామస్వామి నాయకర్ 4) అంబేడ్కర్

32. 'ఒకే మతం, ఒకే కులం, ఒకే దైవం' అనే విధానాన్ని ప్రచారం చేసింది ఎవరు?
1) రాజా రామమోహన్‌రాయ్
2) స్వామి దయానంద సరస్వతి
3) స్వామి వివేకానంద 4) ఎవరూ కాదు

33. 1924 లో వైకోం సత్యాగ్రహాన్ని నిర్వహించింది?
1) అంబేడ్కర్ 2) జ్యోతిరావు పూలే
3) నారాయణగురు
4) పెరియార్ రామస్వామి నాయకర్

34. 'గులాంగిరి' గ్రంథాన్ని రచించింది ఎవరు?
1) జ్యోతిరావు పూలే 2) బి.ఆర్. అంబేడ్కర్
3) భాగ్యరెడ్డి వర్మ 4) ఓంప్రకాశ్ వాల్మీకి

35. 1848 లో తొలి బాలికా పాఠశాలను ఎక్కడ ప్రారంభించారు?
1) రాజమండ్రి 2) ధవళేశ్వరం
3) బొంబాయి 4) పుణె

36. 'తహరీఖ్ ఉల్ అఖ్లాక్' అనే పత్రికను ఎవరు నిర్వహించారు?
1) నవాబ్ అబ్దుల్ లతీఫ్ 2) థియోడర్ బెక్
3) దాదాభాయ్ నౌరోజీ 4) సయ్యద్ అహ్మద్‌ఖాన్

37. 'నేను సోషలిస్ట్‌ని' అని ప్రకటించుకున్న తొలి భారతీయుడు ఎవరు?
1) ఎం.ఎన్. రాయ్ 2) జయప్రకాశ్ నారాయణ్
3) స్వామి వివేకానంద 4) సుభాష్ చంద్రబోస్

38. రహస్య సిద్ధాంతం అనే గ్రంథాన్ని రచించింది?
1) అనిబిసెంట్ 2) జిడ్డు కృష్ణమూర్తి
3) జి.ఎస్. అరుండేల్ 4) మేడం బ్లావెట్‌స్కీ

39. వేద సమాజాన్ని దక్షిణ భారత బ్రహ్మ సమాజంగా రూపొందించింది ఎవరు?
1) మన్నవ బుచ్చయ్య పంతులు
2) కందుకూరి వీరేశలింగం
3) శ్రీధరనాయుడు 4) దేశిరాజు పెదబాపయ్య

40. అకాళీదళ్‌ను ఎప్పుడు స్థాపించారు?
1) 1910 2) 1920 3) 1924 4) 1930

41. సమాధులు, స్మశానాలను ధ్వంసం చేస్తూ, కసాయి వారిని హత్య చేసిన సిక్కు ఉద్యమం ఏది?
1) నామ్‌ధారీ 2) నిరంకారీ 3) కూకా 4) అకాళీదళ్

42. 1888 లో బొంబాయిలో మహాత్మ బిరుదుతో సత్కారం అందుకున్న వ్యక్తి ఎవరు?
1) గాంధీజీ 2) జ్యోతిరావు పూలే
3) గోపాల్ హరిదేశ్‌ముఖ్ 4) ఎవరూ కాదు

43. 'కుడి అరశు' అనే వారపత్రికను నడిపింది ఎవరు?
1) జ్యోతిరావు పూలే 2) రామస్వామి నాయకర్
3) నారాయణ గురు 4) అంబేడ్కర్

44. 1901 లో కొరేగావ్ రైల్వేస్టేషన్‌లో కులవివక్ష ఎదుర్కొన్న వ్యక్తి ఎవరు?
1) అంబేడ్కర్ 2) ఓంప్రకాశ్ వాల్మీకి
3) జ్యోతిరావు పూలే 4) భాగ్యరెడ్డి వర్మ

45. 'జుఠాన్' అనే పేరుతో ఆత్మకథను రాసుకున్నది ఎవరు?
1) అంబేడ్కర్ 2) ఓంప్రకాశ్ వాల్మీకి
3) జ్యోతిరావు పూలే 4) రామస్వామి నాయకర్

46. 1944 లో ద్రవిడ కజగం (DK) పార్టీని స్థాపించింది?
1) రామస్వామి నాయకర్ 2) అన్నాదురై
3) కరుణానిధి 4) పి. త్యాగరాయ చెట్టి

47. కులప్రసక్తి లేని దేవాలయాలను నిర్మించింది ఎవరు?
1) రామస్వామి నాయకర్ 2) రామానుజాచార్యులు
3) రామానందుడు 4) నారాయణ గురు

48. 'శ్రామిక కులాలైన శూద్రులు, అంటరాని కులాలైన అతి శూద్రులు కలిసి పోరాడితేనే కుల వివక్ష పోతుంది' అన్నదెవరు?
1) జ్యోతిరావు పూలే 2) అంబేడ్కర్
3) ఓంప్రకాశ్ వాల్మీకి 4) బాతుల వెంకట్రావ్

49. 1873 లో సత్యశోధక సమాజాన్ని స్థాపించింది ఎవరు?
1) జ్యోతిరావు పూలే 2) అంబేడ్కర్
3) ఓంప్రకాశ్ వాల్మీకి 4) నారాయణ గురు

50. 1903 లో 'నారాయణ ధర్మ పరిపాలనా యోగం' సంస్థను స్థాపించింది ఎవరు?
1) జ్యోతిరావు పూలే 2) నారాయణ గురు
3) రామస్వామి నాయకర్
4) స్వామి దయానంద సరస్వతి

51. ఎగువ కులంలో సంస్కరణోద్యమాన్ని ప్రారంభించింది ఎవరు?
1) జ్యోతిరావు పూలే 2) నారాయణ గురు
3) రామస్వామి నాయకర్ 4) అంబేడ్కర్

52. ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించింది ఎవరు?
1) అంబేడ్కర్ 2) సుభాష్ చంద్రబోస్
3) జవహర్‌లాల్ నెహ్రూ 4) లార్డ్ అట్లీ

53. రాజా రామమోహన్‌రాయ్ మరణానంతరం ఎవరి ఆర్థిక సహకారంతో బ్రహ్మ సమాజాన్ని నిర్వహించారు?
1) దేవేంద్రనాథ్ ఠాగూర్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) రామచంద్ర విద్యావాగీష్ 4) ద్వారకనాథ్ ఠాగూర్

54. 1929 నాటి శారదా చట్టం ప్రకారం బాలికలు, బాలుర వివాహ వయసెంత?
1) 12, 14 2) 14, 16 3) 18, 21 4) 10, 12

55. పాట్నా, కలకత్తాల్లో ముస్లిం పాఠశాలలు (మదరసాలు) స్థాపించింది ఎవరు?
1) సావిత్రిబాయి పూలే 2) రమాబాయి సరస్వతి
3) తారాబాయి షిండే 4) రోకియా సఖావత్

56. యంగ్ బెంగాల్ ఉద్యమాన్ని నిర్వహించింది ఎవరు?
1) హెన్రీ డెరోజియో 2) రాజా రామమోహన్‌రాయ్
3) డేవిడ్ హేర్ 4) అలెగ్జాండర్ డఫ్

57. కింది అంశాలను జతపరచండి.
i) సంవాద కౌముది a) కేశవ చంద్రసేన్
ii) సులభ్ సమాచార్ b) రాజా రామమోహన్‌రాయ్
iii) తత్వబోధిని c) రఘుపతి వెంకటరత్నం
iv) బ్రహ్మ ప్రకాశిక d) దేవేంద్రనాథ్ ఠాగూర్
1) i-a, ii-b, iii-c, iv-d 2) i-b, ii-a, iii-d, iv-c
3) i-d, ii-c, iii-b, iv-a 4) i-c, ii-d, iii-a, iv-b

58. సంగత్‌సభ (సంగీత సభ)ను ప్రారంభించింది ఎవరు?
1) రాజా రామమోహన్‌రాయ్
2) దేవేంద్రనాథ ఠాగూర్ 3) కేశవ చంద్రసేన్
4) ఈశ్వరచంద్ర విద్యాసాగర్

జవాబులు

1-4	13-1	25-1	37-3	49-1
2-4	14-2	26-3	38-4	50-2
3-3	15-2	27-3	39-3	51-2
4-1	16-4	28-1	40-2	52-1
5-1	17-1	29-2	41-3	53-4
6-2	18-3	30-3	42-2	54-2
7-1	19-2	31-3	43-2	55-4
8-4	20-2	32-4	44-1	56-1
9-3	21-4	33-4	45-2	57-2
10-2	22-3	34-1	46-2	58-3.
11-3	23-2	35-4	47-4	
12-2	24-3	36-4	48-1	

ప్రతిభ

★ Which among the following space organizations revealed 10 new rocky, Earth-sized planets that could potentially have liquid water and support life in June 2017? *Ans: c*
a) Indian Space Research Organisation (ISRO)
b) Japan Aerospace Exploration Agency (JAXA)
c) National Aeronautics and Space Administration (NASA)
d) Russian Federal Space Agency (RFSA)

Tiger State of India is...

Current Affairs

1. Recently State-owned oil firms IOC, BPCL and HPCL signed an agreement to jointly set up the world's largest refinery and petrochemical complex in:
a) Maharashtra b) Gujarat
c) Rajasthan d) Karnataka

2. Recently in an attempt to reduce the number of deaths of endangered wildlife in Thar Desert, new "rescue wards" have come up in the far-flung rural areas of Jodhpur. Thar Desert does not lie in:
a) Gujarat b) Haryana
c) Madhya Pradesh d) Punjab

3. Recently Reserve Bank of India has put which bank under prompt corrective action (PCA) due to a sharp increase in bad loans?
a) Union Bank of India
b) Central Bank of India
c) United Bank of India d) IDBI Bank

4. Recently India has decided for the first time to place a dedicated cell to promote investments of which country in India?
a) Canada b) USA
c) Australia d) Russia

5. The National Physical Laboratory (NPL), part of the Council of Scientific & Industrial Research and the only agency in India that is authorised to maintain Indian Standard Time (IST). It is located in:
a) Mumbai b) Allahabad
c) New Delhi d) Kolkata

6. Recently a team of experts at the Indian Institute of Technology - Kharagpur has fashioned a hybrid material based on silk protein called:
a) Silk Lyptonn b) Silk Fibroin
c) Silk Ranyon d) Silk Tinyton

7. Recently the Ministry of Health and Family Welfare has launched 'IDCF' in order to intensify efforts to reduce child deaths due to:
a) Diphtheria b) Tuberculosis
c) Diarrhoea d) Tetanus

8. Who has been appointed as India's ambassador to the European Union (EU) in June 2017?



a) Gaitri Issar Kumar
b) Ajit Vinayak Gupte
c) Reenat Sandhu
d) Ranjan Deepak

9. The government is set to roll out the 'Mission Parivar Vikas' programme to improve family planning services in how many districts of India?
a) 56 b) 78 c) 104 d) 146

10. Name the 1st Indian woman who has been elected as member of International Tribunal for the Law of the Sea (ITLOS)?
a) Sumedha Puri b) Anandita Razdan
c) Koel Agrahari d) Neeru Chadha

11. Recently Anglo American's diamond unit De Beers launched the world's largest diamond exploration vessel off the coast of:
a) South Africa b) Chile
c) Namibia d) Egypt

12. Recently the Asian Infrastructure Investment Bank (AIIB) approved it's first-ever equity investment, worth .... to catalyze private capital for infrastructure projects in India.
a) $ 70 million b) $110 million
c) $150 million d) $230 million

13. Who was the first Indian woman driver competed in one of the highest classes of Formula racing in the country at the upcoming JK Tyre-FMSCI National racing championship?



a) Radha Menon b) Aprajita Sehgal
c) Mira Erda d) Ritu Das

14. According to the study by UK-based Money Super Market what is the present rank of India in survey of nations with the lowest global environmental impact?
a) 34th b) 46th c) 57th d) 75th

15. Who is not among the three countries that will participate in Malabar 2017, a joint mid-summer exercise aimed at addressing shared threats to maritime security in the Indo-Asia Pacific region?
a) Japan b) USA
c) Indonesia d) India

16. David Grossman has won the Man Booker International Prize for his novel "A Horse walks into a bar". David Grossman belongs to:



a) Uganda
b) Canada
c) Australia d) Israel

17. Recently the government, through a notification amending a prevention of money laundering law, has made it mandatory to provide Aadhaar to open a bank account and to conduct a transaction of .... or more.
a) Rs.20,000 b) Rs.50,000
c) Rs.1,00,000 d) Rs.2,50,000

18. According to Environment Minister Dr. Harsh Vardhan, India is committed to achieve Land Degradation Neutrality by the year:
a) 2020 b) 2025 c) 2030 d) 2050

19. Recently which of the following country ratified automatic exchange of financial account information with India and 40 other jurisdictions to facilitate immediate sharing of details on suspected black money?
a) Belarus b) Switzerland
c) Russia d) USA

20. In order to boost G&J sector in the region Gem & Jewellery Training Institute, a first of its kind in Southern India is to be set up in:
a) Kochi b) Palakkad
c) Udupi d) Mangalore

21. In an attempt to keep India's regional navigation satellite system fully operational, ISRO is preparing to launch a back-up for IRNSS-1A, one of the seven satellites in the constellation. What is the name of its regional navigation satellite system?
a) GAGAN b) NavIC
c) Galileo d) None of the above

22. Recently which of the following countries's scientists have found that using blue-green algae and light to trigger photosynthesis could help treat cardiac disease, the top cause of death globally?
a) Japan b) Germany
c) USA d) China

23. Recently P.N.Bhagwati passed away. He was the:
a) Former Chief Election Commissioner of India
b) Former Chief Justice of India
c) Former Indian cricket test team captain
d) First Chief Information Commissioner of India

24. Gorkha Janmukti Morcha has been in the news, because it has been campaigns for the creation of a separate state Gorkhaland within India, out of districts in the north of which of the following states of India?
a) Tamil Nadu b) West Bengal
c) Uttar Pradesh d) Madhya Pradesh

25. Dr. Mahesh Sharma, Minister of State (Independent charge) for Culture & Tourism launched the implementation of the ''National Mission on Cultural Mapping of India' at:
a) Mathura, Uttar Pradesh
b) Chitradurga, Karnataka
c) Tiruchirapalli, Tamil Nadu
d) Kurnool, Andhra Pradesh

26. How many new Post Office Passport Seva Kendras (POPSKs) has been launched by Government of India in June 2017?
a) 50 b) 149 c) 100 d) 500

27. Which is the country's first public transport system to reserve jobs for members of the third gender people in June 2017?
a) Kolkata Metro b) Hyderabad Metro
c) Kochi Metro d) Delhi Metro

28. Sardar Sarovar Dam is being built on which of the following rivers?
a) Tapi b) Krishna
c) Narmada d) Godavari

29. Which of the following states of India is poised to fortify its position as the "Tiger State of India" with major reserves indicating an increase in the tiger population as per the annual census completed recently?
a) Karnataka b) Assam
c) Gujarat d) Rajasthan

30. The Indian Space Research Organisation (ISRO) has progressed to the testing of subsystems in the development of a semi-cryogenic engine for rockets with heavier payload capacity. The semi-cryogenic engine uses a combination of which of the following as propellants?
a) Liquid oxygen (LOX)
b) Refined kerosene (Isrosene)
c) Solid lithium (SLM)
d) Both (a) and (b)

31. Who among the following won the doubles title in the $60,000 ITF women's tennis tournament in June 2017?
a) Prarthana Thombare and Kotomi Takahata
b) Prarthana Thombare and Natcharee Teerachodjiranon
c) Prarthana Thombare and Yu-Yun Li
d) Prarthana Thombare and Natasha Sengphrachanh

32. Right to Information Act reveals that the Election Commission of India had ordered registration of FIR against the Chief Minister and others for alleged electoral malpractices during the Dr. Radhakrishnan Nagar by-election of which of the following states?
a) Tamil Nadu b) West Bengal
c) Goa d) Karnataka

33. A Street in Thuruthi ward of Kasaragod municipality that was recently named 'Gaza', a reference to the disputed strip of land between which of the following countries?
a) Israel and Egypt b) Israel and Syria
c) Israel and Libya d) Israel and Jordon

34. Which among the following Palaces has becomes first Indian building to get trademark in June 2017?
a) Mysore Palace b) Taj Mahal Palace
c) Nizam Palace
d) Raja Maharanjith Singh Palace

35. The 106th Session of International Labour Conference (ILC) was held from 5-16th June 2017 in:
a) USA b) South Africa
c) Switzerland d) Norway

36. How many member countries are there in the Asian Infrastructure Investment Bank?
a) 80 b) 10 c) 50 d) 40

37. Reserve Bank of India said its internal advisory committee (IAC) had identified 12 accounts, which account for .... % of non-performing assets of the Indian banking system for immediate resolution under the Insolvency and Bankruptcy Code (IBC).
a) 30 b) 25 c) 20 d) 15

38. The 'Make in India' initiative unveiled by Prime Minister Narendra Modi in 2014, provided the supply side intervention(s) of which of the following?
a) FDI reforms
b) Ease of doing business
c) Scaling up physical infrastructure and competitive federalism
d) All of the above

39. Which among the following country's cricket team has won its maiden ICC Champion Trophy in June 2017?
a) India b) England
c) Pakistan d) South Africa

40. Who among the following won the Indonesia Open men's singles trophy in June 2017?
a) Sai Praneeth b) Son Wan Ho
c) Kidambi Srikanth d) Kazumasa Sakai

Key

1-a	10-d	19-b	28-c	37-b
2-c	11-c	20-c	29-a	38-d
3-b	12-c	21-b	30-d	39-c
4-d	13-c	22-c	31-a	40-c
5-c	14-d	23-b	32-a	
6-b	15-c	24-b	33-a	
7-c	16-d	25-a	34-b	
8-a	17-b	26-b	35-c	
9-d	18-c	27-c	36-a	

హాయ్! బుజ్జీ!!

లంచ్‌బాక్స్‌లు చూడండి... తినడం కుదరదండి!

నీకో లక్ష్యం ఉండటమే కాదు, దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునేలా వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి
- అబ్దుల్ కలాం

స్కూలుకు పుస్తకాలతో పాటు తప్పకుండా తీసుకుపోయేదేంటి? ఒక్క నిమిషం ఆలోచించైనా టిఫిన్ బాక్స్ అని చెప్పేస్తాం. ఎందుకంటే అది కూడా మనం బడికి తీసుకుపోయే వాటిల్లో ముఖ్యమైంది. అందుకే ఇష్టమైన కార్టూన్‌పాత్రల బొమ్మలతో, రంగు రంగుల్లో మనకు నచ్చిన ఆకారాల్లో ఉన్న డబ్బాలను కొనుక్కుంటాం. సరేగానీ ఇదంతా ఇప్పుడెందుకు అనే సందేహం వచ్చిందా?

- రకరకాల భోజన డబ్బాలతో ఉందో ప్రదర్శనశాల. పేరు 'లంచ్‌బాక్స్ మ్యూజియం'. అతి పెద్దది కూడా. చూడాలంటే అమెరికా జార్జియాలోని కొలంబస్‌కు వెళ్లాల్సిందే.
- ఇందులో అడుగుపెట్టగానే ఒకటి కాదు రెండు కాదు వరుసల్లో పేర్చిన బోలెడు డబ్బాలు కనిపిస్తాయి. వీటి సంఖ్య దాదాపు 3,500. ప్లాస్టిక్, మెటల్ వంటి రకరకాల పదార్థాలతో చేసినవి ఇవన్నీ.



- అలెన్ ఉడాల్ అనే తాతయ్య సేకరించి పెట్టారీ డబ్బాలన్నింటినీ. 1990 నుంచి ఈ పని మొదలుపెట్టాడట. అలా ఆనాటి డబ్బాల నుంచి అంటే మన నాన్నలు బడికి తీసుకెళ్లిన వాటి నుంచి ఇప్పటి కొత్తరకం లంచ్‌బాక్స్‌ల వరకూ చూడొచ్చు.

మీకు తెలుసా?

- పనిచేసే దగ్గరకు డబ్బాలో భోజనం తీసుకెళ్లే పద్ధతి 200 సంవత్సరాల క్రితమే మొదలైంది.
- 1950 నుంచి 1970ల్లో టిఫిన్ - లంచ్ బాక్స్‌ల అలవాటు ఎక్కువగా పెరిగిందట. రకరకాల అలంకరణలతో మార్కెట్లోకి వచ్చాయట.

పదసంపద!



రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Puff = ఊదుట, ఉబ్బు
- కలహం = పోట్లాట

నవ్వుల జల్లులు!



శీను: అమ్మా! పక్కింటాంటీ ఏంటీ, కుర్చీ పట్టుకుని నీ వెనకే తిరుగుతోంది?
తల్లి: నేను కట్టుకున్నది ఆవిడ పట్టుచీరలే!
- తోట తిరుపతిరావు, విశాఖపట్నం



తల్లి: గోడను అలా భూతద్దం పెట్టి చూస్తున్నావేంటి?
బిట్టు: నువ్వే కదమ్మా గోడలకు చెవులుంటాయన్నావు. అందుకే వెతుకుతున్నా!
- మంగళపల్లి కొమురయ్య, తొర్రూరు

చిలిపి ప్రశ్న



పరుగులు ఎక్కడ తీస్తారు?
- ఎం. నాగభూషణం, మహబూబ్‌నగర్

ఎటు చదివినా ఒకటే!

BUSH SAW SUNUNU SWASH SUB.

ఐదు తేడాలు కనుక్కోండి





పట్టికలో పదాలు

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

Z	B	W	K	X	B	R	V	P	L	A	E	V	O	Z
J	P	R	A	J	V	U	O	E	Y	D	R	T	Q	T
P	C	A	L	E	C	N	A	D	U	O	U	B	G	Q
R	I	W	R	A	U	I	F	F	V	X	T	O	K	T
O	S	S	F	T	W	V	G	C	E	D	U	I	R	H
G	U	Q	D	Y	Y	E	A	D	K	A	F	K	E	P
R	M	A	C	N	G	R	O	C	O	L	L	E	G	E
A	L	Z	A	O	E	S	D	A	N	G	S	C	W	A
M	O	Y	R	W	S	I	O	Z	W	T	U	T	S	K
M	O	Q	D	K	N	T	R	B	O	N	C	X	Y	D
X	H	P	S	N	E	Y	H	F	G	R	C	E	S	F
W	C	H	E	N	O	I	T	A	R	B	E	L	E	C
N	S	R	K	V	A	S	G	I	F	T	S	C	U	A
A	B	I	B	G	D	X	C	W	W	R	S	P	K	P
W	A	W	A	R	D	S	S	P	E	C	I	A	L	E

SUCCESS, FUTURE, PROUD, PARTY, GIFT, DINNER, DANCE, GOWN, MUSIC, FRIENDS, CARDS, CELEBRATION, SPECIAL, COLLEGE

సరదా వాక్యాలు

కింది ఖాళీల్లో సరైన శరీర భాగాల పేర్లు రాస్తే వాక్యాలు అర్థవంతం అవుతాయి.

1. ☐☐ ప్రాణం తోకకు వచ్చింది.
2. ☐☐☐ వాసిలో ప్రమాదం తప్పింది.
3. ☐☐ మంచిదైతే ఊరు మంచిదవుతుంది.
4. ☐☐☐ చించుకుంటే కాళ్లమీద పడినట్లు
5. ☐☐ బంధం ఎంతో గొప్పది
6. ☐☐☐☐లో వైకుంఠం చూపించినట్లు
7. ☐☐☐కాలాక ఆకులుపట్టుకున్నా లాభం లేదు

- ఆర్. టీనా శ్రీభవిష్య, విజయనగరం

మంచు గడ్డలు మునగవెందుకు?



ప్రశ్న: మంచు గడ్డలు నీటిలో ఎందుకు మునగవు?
- బి. రాజేశ్వర్, పొన్కల్

జవాబు: ఏయే ద్రవాల్లో ఏయే పదార్థాలు మునుగుతాయో లేదా తేలుతాయో తెలిపే ప్లవన సూత్రాలు పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయి. ఒక ద్రవపు సాంద్రత కన్నా అందులో పడిన వస్తువు సాంద్రత తక్కువైతే ఆ పదార్థం తేలుతుందని ఎక్కువైతే మునుగుతుందని, సమానమైతే మునగకుండా తేలకుండా మధ్యలో వేలాడుతుందని ఆ సూత్రాలు తెలుపుతాయి. నీటి సాంద్రతకన్నా మంచు గడ్డ సాంద్రత తక్కువ. అందువల్లే మంచు గడ్డలు నీటిపై తేలుతున్నాయి. ప్రకృతిరీత్యా ఈ ధర్మం ఉండటం వల్లే చాలా తక్కువ ఉష్ణోగ్రత ఉన్న ధ్రువ ప్రాంతాలు, చలి ప్రాంతాల్లో ఉన్న సముద్రపు నీటిపై మంచుగడ్డలు ఉన్నా, కింద ఉన్న నీరు ద్రవరూపంలో ఉండటం వల్ల జలచరాలు బతుకుతున్నాయి. మరో తమాషా ఏంటంటే పైన మంచు గడ్డల బరువు వల్ల కిందున్న నీరు గడ్డకట్టే లక్షణం ఇంకా తగ్గిపోయి ద్రవ రూపంలోనే ఉంటుంది.



- ప్రొ॥ ఎ.రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

ఒక్కటి చాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Mother ☐ త
2. Lid ☐ త
3. Donor ☐ త
4. Swim ☐ త
5. Grandfather ☐ త
6. Crab ☐ త
7. Pair ☐ త

జవాబులు: **చిలిపిప్రశ్న:** నేలపైన! **సరదా వాక్యాలు :** 1. తల 2. వెంట్రుక 3. నోరు 4. కడుపు 5. పేగు 6. అరచేతి 7. చేతులు **ఒక్కటి చాలు:** 1. మాత 2. మూత 3. దాత 4. ఈత 5. తాత 6. పీత 7. జత **ఐదు తేడాలు కనుక్కోండి:** ఎలుగు తోక, నోరు, పెంగ్విన్ కాలు, రెక్క, గొడుగు

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net



గాయపడిన మస్తాన్

ఆర్టీసీ బస్సు ఢీ

తండ్రీకొడుకులకు గాయాలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని మైదుకూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు మండలంలోని బొజ్జవారిపల్లెకు చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తి ప్రొద్దుటూరులో దర్జీ పని చేస్తున్నారు. గురువారం ఉదయం తన తండ్రి మాబును స్కూటీలో ఎక్కించుకుని ప్రొద్దుటూరు వస్తున్నారు. మార్గమధ్యలో మైదుకూరు రోడ్డులోని టీవీఎస్ షోరూం వద్దకు రాగానే ప్రొద్దుటూరు డిపోనకు చెందిన హైర్ బస్సు కడప నుంచి వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో మస్తాన్ తల, చెవికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతని తండ్రి మాబు కూడా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో బాధితులను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కడప రిమ్స్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఈ విషయమై గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై చంద్రశేఖర్‌ను అడగ్గా తమకు సమాచారం వచ్చిందన్నారు.



గాయపడిన మాబు

గొలుసు మద్యం.. తెలిసినా చోద్యం

- ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న నిర్వాహకులు
- జిల్లాలో ఇప్పటి వరకు 59 దుకాణాలు గుర్తింపు
- 60 మంది అరెస్టు.. 717 మద్యం సీసాలు స్వాధీనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: మూడేళ్ల పాటు నిద్రావస్థలో ఉన్న ఆబ్కారీ అధికారులు స్వయాన ముఖ్యమంత్రి చెపితే తప్పా మేల్కో లేదు. ముఖ్యమంత్రి నోట్లో నుంచి గొలుసు దుకాణాల తాట తీయండని ప్రకటన వెలువడిన వెంటనే ఆబ్కారీ అధికారులు రంగంలోకి దిగారు. జులై 19 నుంచి ఆగస్టు 8 వరకు జిల్లావ్యాప్తంగా 59 గొలుసు దుకాణాలను గుర్తించారు. 60 మందిని అరెస్టు చేశారు. ఆబ్కారీ అధికారులు ఓ వైపు దాడులు చేస్తున్నప్పటికీ మరో వైపు అక్రమ దుకాణాలు వెలుస్తూనే ఉన్నాయి. జిల్లాలో ఇంకా కొన్ని గ్రామాల్లో నేటికీ మద్యం ఏరులై పారుతోంది. పూర్తిస్థాయిలో కట్టడి చేస్తారో.. లేదో వేచి చూడాలి. జిల్లాలో గొలుసు దుకాణాలు లేవంటూనే మరో వైపు దాడులు చేయడం విడ్డూరంగా ఉంది. అక్రమ మద్యం అమ్మకాలపై అధికారులకు తెలుసు, అయినప్పటికీ చోద్యం చూస్తున్నారు. ఆబ్కారీ అధికారులు ఎన్ని దాడులు చేసినప్పటికీ వారు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.

★ జిల్లాలోని 12 ఆబ్కారీ రాణాల పరిధిలో 255 మద్యం దుకాణాలున్నాయి. ఈ సారి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల నుంచి 500 మీటర్ల అవతల దుకాణాలను ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు, బార్లు లేవు. పైగా ఈ సారి మద్యం దుకాణాలను లైసెన్సు ఫీజు తగ్గించడంతో భారీగా ప్రైవేటు వ్యక్తులు పోటీ పడ్డారు. అదృష్టం ఉన్న వారికి లాటరీలో దుకాణాలు దక్కాయి. పైగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దుకాణాల కోసం పోటీ పడ్డారు. దుకాణాలు రాని వారు వేరే వ్యక్తుల నుంచి దుకాణాలు కొనుగోలు చేసిన దాఖలాలున్నాయి.

గొలుసు దుకాణాలే ఆధారం

జిల్లాలో మద్యం దుకాణాలు ఎన్ని ఉంటే అంతకు నాలుగింతలు గొలుసు దుకాణాలుంటాయి. మద్యం దుకాణాల్లో వ్యాపారం ఒక ఎత్తయితే, గొలుసు దుకాణాల్లో అమ్మకాలు మరో ఎత్తు. ఈ దుకాణాల్లో ఎక్కువ ధరతో మద్యం విక్రయిస్తుంటారు. దీంతో ఎక్కువ ఆదాయం వాటి వలనే వస్తుంది. పైగా ప్రతి ఒక్క మద్యం వ్యాపారస్తుడు తన పరిధిలో కనీసం మూడు నుంచి అయిదు చొప్పున గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆబ్కారీ అధికారుల వల్ల లేని పోని సమస్యలు ఎందుకని భావించే వారు వాటి జోలికి వెళ్లడం లేదు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ గొలుసు దుకాణాలున్నాయి. ఇటీవల కాలంలో కడప నగర నడిబొడ్డున కాగితాల పెంట, పాత కడపలో రెండు గొలుసు దుకాణాలపై అధికారులు దాడులు చేశారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉండవంటే ఎవరు నమ్ముతారు.

నిరంతరం దాడులు



జులై 19 నుంచి నిరంతరంగా ఆబ్కారీ అధికారులు బృందాలుగా విడిపోయి అక్రమ మద్యం దుకాణాలపై దాడులు చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 59 అక్రమ మద్యం దుకాణాలను గుర్తించి, 61 మందిపై కేసులు నమోదు చేశాం. 717 మద్యం సీసాలను స్వాధీనపరచుకున్నాం. పది దుకాణాలను అనుసంధానం చేశాం. 90 శాతం మేరకు అక్రమ మద్యం దుకాణాలు లేవు. అయినప్పటికీ దాడులు కొనసాగిస్తూనే ఉంటాం. ఎక్కడైనా అక్రమ మద్యం దుకాణాలుంటే తమకు సమాచారం ఇవ్వండి.

- రాధయ్య, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అదనపు కమిషనర్, కడప

ఎత్తుకు పైఎత్తులు

గతంలో గొలుసు దుకాణంపై దాడులు చేసినప్పుడు కేవలం అతన్ని మాత్రమే అరెస్టు చేసి కేసు నమోదు చేసే వారు. కానీ ఇప్పుడు కొత్తగా ఆబ్కారీ అధికారులు దాడులు చేసినప్పుడు దొరికిన మద్యం సీసాలపై ఉన్న హోలోగ్రామ్ ఆధారంగా మద్యం సీసాలను ఏ దుకాణం నుంచి కొనుగోలు చేశారో ఆ మద్యం దుకాణాదారుడిపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో తెలివిగా మద్యం కొనుగోలు చేసిన వెంటనే సీసాలపై ఉన్న హోలోగ్రామ్ స్టిక్కర్ల తొలగిస్తున్నారు. అప్పుడు ఆ మద్యం ఎక్కడ కొనుగోలు చేసిందో తెలుసుకోవడం కష్టంగా మారింది. అంత మాత్రాన ఆబ్కారీ అధికారులు వదిలిపెట్టడం లేదు. వారి శైలిలో నిజాలు రాబడుతున్నారు.

సంచార మద్యం దుకాణాలు

ఒకప్పుడు గొలుసు దుకాణాలంటే సందుల్లో, ఎవరికి కనిపించని విధంగా బంకుల్లో, చిన్న చిన్న నివాసాల్లో ఉండేవి. అధికారులు దాడులు చేస్తుండడంతో వారు కూడా తెలివిగా సంచార మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలు వేసుకుని కూడలి వద్దకు వస్తారు. వాహనాన్ని ఓ పక్కన పెట్టి ఎవరికి అనుమానం రాకుండా జేబుల్లో మద్యం సీసాలను పెట్టుకుని విక్రయిస్తున్నారు. కొంత మంది ఏకంగా వాహనంపై కూర్చోని మద్యం విక్రయిస్తున్నారు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ అక్రమ మద్యం దుకాణాలను కట్టడి చేయలేకపోతున్నారు.



ఇటీవల పోలీసులు పట్టుకున్న గొలుసు దుకాణదారుడు, మద్యం

పది దుకాణాల అనుసంధానం

జిల్లాలో ఆబ్కారీ అధికారులు గొలుసు దుకాణాలపై దాడులు చేసినప్పుడు వారికి దొరికిన మద్యం సీసాలను పరిశీలించగా వాటిని ఏ దుకాణంలో కొనుగోలు చేశారో తెలుసుకుని ఆ దుకాణాలపై కూడా కేసులు నమోదు చేశారు. నాలుగు దుకాణాలను సస్పెండ్ చేశారు. కొన్ని దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. కడపలో మూడు, రాజంపేటలో 1, కోడూరులో 2, ప్రొద్దుటూరులో 1, బద్వేలులో 2, మైదుకూరులో 1 చొప్పున మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఇచ్చే ఉత్తర్వులపై వీటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.


మద్యం దుకాణాలు ఎత్తివేయాల్సిందే

వివిధ సంఘాల ఆందోళన

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రామేశ్వరం ప్రాంతాన్ని మద్యం దుకాణాలతో నేరాలకు అడ్డాగా మారుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాలను సత్వరం ఎత్తివేయడానికి తగిన చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వివిధ సంఘాలకు చెందిన మహిళలు, నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని రామేశ్వరంలో మద్యం దుకాణాలను ఎత్తివేయాలని డిమాండు చేస్తూ దీనికి నిరసనగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డితో పాటు ఆయా మహిళా సంఘాలు ర్యాలీగా ఆబ్కారీ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం నాయకురాలు, మద్యం వ్యతిరేక పోరాట సమితి ఐక్యవేదిక కన్వీనర్ పద్మ, ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనరసయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు గొర్రె శ్రీనివాసులు, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జయశ్రీ, సీపీఐ, సీపీఎం నాయకులు సుబ్బరాయుడు, సత్యనారాయణ, బీసీ సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడారు. నెల రోజుల క్రితం మద్యం దుకాణాలను ఎత్తివేయాలని ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే ఇష్టానుసారం అనుమతులు కుటుంబాలను విచ్చిన్నం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రామేశ్వరంలోని 5 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయలేదన్నారు. మద్యం దుకాణాలు ఎత్తివేయకుంటే తాను ఒంటిపై మద్యం పోసుకుని కాల్చుకుని చనిపోతానని లత అనే మహిళ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి విజయశేఖర్ మహిళా సంఘాలతో మాట్లాడారు. రెండు రోజుల్లో రామేశ్వరం వచ్చి స్థానికుల అభిప్రాయాలు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చర్యలు తీసుకోకపోవడంలో ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు. అనంతరం ఈఎస్ విజయశేఖర్ ఎక్సైజ్ విభాగం కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. పరిస్థితిని సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దుకాణాలపై చర్యలు తీసుకోండి

రామేశ్వరంలోని నివాసాల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆబ్కారీ శాఖ పర్యవేక్షణాధికారి విజయశేఖర్‌ను కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం బడి, గుడికి 500 మీటర్ల దూరంలోపే ఏర్పాటు చేయకూడదన్నారు. స్థానిక మహిళలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే ఈఎస్‌తో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సి.ఐ. వెంకటశివారెడ్డి, ఎస్సై చిన్న పెద్దయ్య, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ వైకాపా అధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్, న్యాయవాది జింకా విజయలక్ష్మి, పోసా భాస్కర్, వైకాపా జిల్లా అధికార ప్రతినిధి వెల్లల భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.





ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే, మహిళా సంఘాలు.. ఆబ్కారీ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించేదీ లేదని సిండికేట్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏడురోడ్ల కూడలి సమీపంలోని సిండికేట్ బ్యాంకు వద్ద గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని వివిధ బ్యాంకుల ఉద్యోగులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ... యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల మీద అనవసరమైన బ్యాంకు ఛార్జీలను విధిస్తూ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులను గురిచేస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాల రద్దుకు సూచనలు ఇవ్వడాన్ని కార్మిక సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ నెల 22న దేశవ్యాప్తంగా 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మెలో వెళ్లటానికి సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల యూనియన్ నాయకులు సంజీవరాయుడు, దస్తగిరి, ప్రసన్న కుమార్, గురుదయ్య, లావణ్య, సుజాత, లలిత, ఆంజనేయుల నాయక్, మంజూష, సాయికుమార్, అర్జున్, శ్వేతాంబరరెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

హోంగార్డుగా ఉద్యోగ నియామక పత్రం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎన్. శ్రీకాంత్ (హెచ్‌జీ నంబరు: 890) భార్య పద్మావతికి జిల్లా పోలీసు అధికారి బాబూజీ గురువారం తన ఛాంబరులో హోంగార్డు ఉద్యోగ నియామక పత్రాన్ని అందచేశారు. హోంగార్డు ఉద్యోగం ఇవ్వడం పట్ల పద్మావతి సంతోషం వ్యక్తం చేశారు. మానవతతో ఎస్పీ ఉద్యోగం ఇచ్చి తన కుటుంబాన్ని ఆదుకున్నారని జీవిత కాలం పాటు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులను కూడా పోలీసులతో సమానంగా చూస్తామన్నారు. హోంగార్డు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ విజయకుమార్, ఆర్‌ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.



మృతి చెందిన హోంగార్డు భార్యకు ఉద్యోగ నియామక పత్రాన్ని అందచేస్తున్న ఎస్పీ బాబూజీ

రూ.8 లక్షలు చెక్కు అందచేసిన ఎస్పీ

కడప జిల్లా సీకే.దిన్నె రాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఎం. దీపక్ దేవానంద్ భార్య కరుణకు ఎస్పీ బాబూజీ గురువారం తన ఛాంబరులో రూ.8 లక్షలు భద్రత చెక్కును అందచేశారు. ఎస్పీ కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో పోలీసులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్క పోలీసు గుర్తించుకోవాలని కోరారు. పోలీసు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అబ్దుల్ ఖాదర్ ఉన్నారు.



వినాయకనగర్ కూడలి నుంచి కొత్త కలెక్టరేట్‌కు తరలిస్తున్న మూడు చక్రాల వాహనాలు

బండెనక బండి.. దివ్యాంగులకేనండి

బండెనక బండి.. అన్ని మూడు చక్రాలే నండి.. ఇన్నింటిని ఒకేసారి ఎలా తీసుకెళ్లాలో తెలియక ఆటోకు కట్టి మరీ లాక్కెళుతున్నారు. దీంతో చిన్నపాటి రైలు బండిని తలపించింది. ఆగస్టు 15 సందర్భంగా జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు పంపిణీ చేయడానికి ఈ మూడు చక్రాల సైకిళ్లను అనంతపురం జిల్లా నుంచి తెప్పించగా వినాయక్ చౌరస్తా వద్ద దించి వెళ్లారు. దీంతో వాటిని ఆటోకు కట్టి కొత్త కలెక్టరేట్‌కే చేర్చారు. మరియపురం వద్ద తీసిన చిత్రమిది.

చిత్రాలు : శ్రీనివాస పట్నాయక్

రైల్వేలో కీమెన్ల పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న ఎస్ఎస్ఈ

అరవిందనగర్, (న్యూస్‌టుడే, కడప): వర్షాకాలంలో రైల్వే ట్రాక్‌పై వచ్చే సమస్యలపై కీమెన్‌లు, ట్రాక్‌మెన్‌లు కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుందని సీనియర్ సెక్షన్ ఇంజినీరు (ఎస్ఎస్ఈ) ఎన్. శ్రీనివాసులరెడ్డి సూచించారు. నగరంలోని రైల్వేస్టేషన్‌లోని ఎస్ఎస్ఈ కార్యాలయంలో గురువారం కడప సెక్షన్ పరిధిలోని కీమ్యాన్, ట్రాక్‌మ్యాన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో అనేకసమస్యలు ఉత్పన్నమవుతాయని ఎక్కువగా వర్షం కురిస్తే వంతెనల వద్ద నీటి ప్రవాహం పెరిగి ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు. తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదని నిత్యం వస్తువులను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితల సమయంలో సమస్యలున అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఈ వెంకటేశ్వర్రావు, జేఈ అమరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కదిలించిన కథనం.. కలెక్టరు పల్లె పయనం

అడవిబాటలో.. కాలినడకన ఏకిరిపల్లెకు చేరిన జిల్లా పాలనాధికారి



రహదారి గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న స్థానికులు

రాజంపేట, న్యూస్‌టుడే : రహదారి సౌకర్యం లేని మారుమూల కుగ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు స్పందించారు. అడవి మార్గంలో ఆరు కిలోమీటర్లు కాలినడకన పయనించి ఆ గ్రామాన్ని చేరుకున్నారు. పల్లె ప్రజల కష్టసుఖాలను ఆలకించారు. మీ సమస్యలు తీరుస్తానని భుజం తట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులు పల్లెబాట పట్టాలని ఇటీవల ఆదేశించింది. ఈ క్రమంలో 'ఏకిరిపల్లెకు దారేది?' శీర్షికన గురువారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టరు గురువారం ఉదయాన్నే ఏకిరిపల్లెకు పయనమయ్యారు. రాజంపేట మండలంలోని మూరుమూల ప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి చేరుకోవడానికి మొదట బగ్గిడిపల్లెకు చేరుకున్నారు. అక్కడి నుంచి అడవిబాట పట్టారు. ముళ్లపొదలను తప్పించుకుంటూ.. రాళ్ల గుట్టలను ఎక్కిదిగుతూ ఏకిరిపల్లెకు చేరుకున్నారు. మార్గమధ్యంలో అలసిపోయిన ఆయన బండరాళ్లపై కాసేపు సేదతీరుతూ పల్లెలో అడుగుపెట్టారు. సాధారణంగా జిల్లా కలెక్టర్ ఏదైనా గ్రామానికి వస్తున్నారంటే రెవెన్యూ యంత్రాంగంతో పాటు పోలీసు బందోబస్తు ఉంటుంది. ఈ గ్రానికి ఆయన వస్తున్నట్లు కనీసం పోలీసులకు కూడా తెలియదు. రెవెన్యూ అధికారులకు కూడా అప్పటికప్పుడు సమాచారం అందించారు.

బాధలు విన్నారు.. భరోసా ఇచ్చారు : ఏకరిపల్లెకు కాలిబాటన చేరుకున్న జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు స్థానిక ప్రాథమిక పాఠశాలలో గ్రామస్థులతో మాట్లాడారు. మీరు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.. ఏయే సౌకర్యాలు కావాలి.. తాగునీరు ఉందా... ఉపాధ్యాయులు వస్తున్నారా.. అంగన్వాడీ కేంద్రం నడుస్తోందా.. రెవెన్యూ అధికారులు వస్తున్నారా, వైద్య సిబ్బంది సక్రమంగా సేవలు అందిస్తున్నారా అంటూ ఆరా తీశారు. గ్రామంలో తీవ్ర అపరిశుభ్రత ఉందని, దీనివల్ల అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు. ఈ సమయంలో గ్రామస్థులు పలు సమస్యలను వివరించారు. తమకు బగ్గిడిపల్లె నుంచి ఏకరిపల్లె గ్రామానికి రహదారి కావాలని, కొంతమేర రోడ్డు వేశారని, మిగిలిన భాగం అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని విన్నవించారు. రహదారి సమకూరితే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఇంకా తమకు పక్కాగృహాలు కావాలని, వ్యవసాయ భూములను ఇవ్వడంతో పాటు బోర్లు వేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. స్థానికుడు ప్రతాప్‌రెడ్డి గ్రామ సమస్యలను సంపూర్ణంగా వివరించారు. గతంలో ఏకిరిపల్లెకు రహదారి మంజూరైనప్పటికీ రాజకీయ కారణాలతో వేయలేకపోయారని కలెక్టర్‌కు ఆయన తెలియజేశారు. అటవీ మార్గంలో 1.20 కిలోమీటర్ల రహదారి పూర్తిచేస్తే ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడతాయని చెప్పారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని కాలినడకన బగ్గిడిపల్లెకు చేరుకోవాల్సి వస్తోందని వివరించారు. వారి కష్టాలు విన్న కలెక్టరు స్పందిస్తూ.. ఈ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి తొలుత రహదారి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత మిగతా సమస్యలన్నీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

స్పందనకు వందనం

ట్రాక్టర్‌ను నడుపుతూ తిరుగు పయనం.. : ఏకిరిపల్లెకు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడిన అనంతరం కలెక్టరు తిరుగు ప్రయాణంలో గ్రామం నుంచి ట్రాక్టరుపై బయల్దేరారు. డ్రైవరు పక్కన కూర్చుని కొంతదూరం ప్రయాణించిన ఆయన చెయ్యేరు నదిలోకి రాగానే చోదకుడి స్థానంలో కూర్చున్నారు. బగిడ్డిపల్లె వరకు చెయ్యేరు నదిలో ట్రాక్టరు నడిపారు. ఇంతకు ముందు గ్రామానికి వచ్చిన అధికారులంతా ట్రాక్టర్లపైనే వచ్చేవారు. తొలిసారి జిల్లా కలెక్టరు అటవీమార్గంలో కాలినడకన తమ గ్రామానికి రావడంతో ఇక తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఏకిరిపల్లె వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ కష్టాలపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడం వల్లే ప్రభుత్వ విప్, న్యాయ ప్రాధికార సంస్థ అధికారులతో పాటు ప్రస్తుతం కలెక్టరు తమ గ్రామానికి వచ్చారని వారు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో 'ఈనాడు' కృషి మరువలేమని పేర్కొన్నారు.



పాఠశాలలో పప్పును రుచి చూస్తున్న పాలనాధికారి

ఎస్జీటీలకు బదిలీల ఉత్తర్వులు విడుదల

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా ఎస్జీటీలకు గురువారం బదిలీల ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఈ నెల 2వ తేదీకి బదిలీల కౌన్సెలింగ్ పూర్తయినా ఉత్తర్వుల విడుదలలో జాప్యంపై సర్వత్రా చర్చసాగింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ పరిధిలోని ఎస్జీటీ తెలుగు విభాగం 2158 మంది, ఉర్దూ విభాగం 153 మంది, ప్రభుత్వ పరిధి తెలుగు విభాగం ఆరు మంది మొత్తంగా 2317 మందికి ఉత్తర్వులు వచ్చాయి. గురువారం సాయంత్రం ఎస్జీటీలు పనిచేస్తున్న ఆయా పాఠశాలల్లో రిలీవ్ అయి శుక్రవారం ఉదయం కొత్తగా బదిలీ అయిన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాలని అందులో పేర్కొన్నారు. వాస్తవానికి షెడ్యూలు ప్రకారం జులై 31వ తేదీ నాటికి బదిలీల కౌన్సెలింగ్ పూర్తయి ఆగస్టు 1వ తేదీన కొత్త పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరాల్సి ఉండగా ప్రక్రియ ఆలస్యం కావడంతో ఎట్టకేలకు బదిలీల అంశం ముగిసింది.

జిల్లాలో మొదలైన క్రికెట్ సందడి

నేటి నుంచి అండర్-16 అంతర్ జిల్లాల పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ అభిమానులకు మళ్లీ క్రికెట్ సందడి మొదలైంది. శుక్రవారం నుంచి 29వ తేదీ వరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్ జిల్లాల 'గ్రూప్-ఏ' క్రికెట్ పోటీలు నగరంలోని మైదానాల్లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ పూర్తి చేసింది. ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు పోటీ పడుతున్నట్లు ఆంధ్ర క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు వెంకట శివారెడ్డి, జిల్లా కార్యదర్శి రామమూర్తి తెలిపారు. 2017-18 క్రికెట్ సీజన్‌కు సంబంధించి కడపలో ఇప్పటికే అండర్-19, అండర్-23, టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. మళ్లీ ఇప్పుడు అండర్-16 టోర్నమెంట్‌ను కడపకు ఏసీఏ కేటాయించడం జరిగిందని చెప్పారు. అండర్-16 టోర్నమెంట్‌ను కూడా కడప జిల్లా క్రికెట్ సంఘం సభ్యుల సహకారంతో విజయవంతం చేస్తామన్నారు. షెడ్యూలును వారు వివరించారు.

అండర్-16 క్రికెట్ షెడ్యూలు

తేదీ	పాల్గొనే జట్లు	పోటీలు జరిగే మైదానం
11 నుంచి 13 వరకు	విశాఖపట్నం - పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం
	కృష్ణ - నెల్లూరు	కెఎస్ఆర్ఎం మైదానం
	చిత్తూరు - తూర్పుగోదావరి	కెఓఆర్ఎం మైదానం
15 నుంచి 17 వరకు	విశాఖపట్నం - తూర్పుగోదావరి	కెఎస్ఆర్ఎం
	కృష్ణ - పశ్చిమగోదావరి	కెఓఆర్ఎం
	చిత్తూరు - నెల్లూరు	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం
19 నుంచి 21 వరకు	విశాఖపట్నం - నెల్లూరు	కెఓఆర్ఎం
	కృష్ణ - చిత్తూరు	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం
	తూర్పుగోదావరి - పశ్చిమగోదావరి	కెఎస్ఆర్ఎం
23 నుంచి 25 వరకు	చిత్తూరు - విశాఖపట్నం	కెఎస్ఆర్ఎం
	కృష్ణ - తూర్పుగోదావరి	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం
	పశ్చిమగోదావరి - నెల్లూరు	కెఓఆర్ఎం
27 నుంచి 29 వరకు	కృష్ణ - విశాఖపట్నం	కెఎస్ఆర్
	చిత్తూరు - పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం
	నెల్లూరు - తూర్పుగోదావరి	కెఎస్ఆర్ఎం